ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 2 ఏప్రిల్ 2025





ఒంటిమిట్ట కోదండరాముని ఆలయం

భూగర్భజలాలను పెంచుదాం

● పశువులకు ఉపయోగపడేలా తొట్లు నిర్మించండి : కలెక్టర్



ఫారంపాండ్ పనులకు పూజ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

సంబేపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రైతుల పొలాల్లో ఫారం పాండు గుంతలతో భూగర్భజలాలను పెంచుదామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నబిడికి గ్రామం తాటికుంట హరిజనవాడ వద్ద రైతు రామచంద్ర పొలంలో ఫారంపాండ్ పనులకు, నాగిరెడ్డిగారిపల్లె వద్ద పశువుల నీటితొట్టి పనులకు డ్వామా పీడీ వెంకటరత్నం, ఎంపీడీవో రామచంద్ర, స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వర్షపు నీటి బిందువును ఒడిసిపట్టి నీటిని నిలువ చేసుకున్నప్పుడే భూగర్భజలాలు పెంపొందుతాయని తెలిపారు. సంబేపల్లె మండలంలో 209 నీటి గుంతలను మంజూరు చేసినట్లు తెలిపారు. పల్లెల్లో నీరు ఉన్న ప్రాంతంలో పశువులకు నీటి తొట్లను నిర్మించాలని అధికారులకు తెలిపారు. మండలంలో కరువు పరిస్థితులపై స్థానిక రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో పరిస్థితులను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి, ఉపాధి హామీ ఏపీడీ మధుబాబు, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, రంగారెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు నిలిపిన ప్రాణానికి

నారా లోకేశ్ అండ

6



ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు టీటీడీ అధికారికంగా నిర్ణయించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానపత్రికలు కూడా అందచేసింది. టీటీడీ అధికారులు కడప జిల్లా యంత్రాంగంతో కలుపుకుని బ్రహ్మోత్సవాలు వైభవంగా చేసేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 11న సాయంత్రం 6.30 గంటల నుంచి జరిగే కల్యాణోత్సవానికి కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర భద్రాద్రి కోదండరాముడి ప్రాశస్త్యం గురించి మరోసారి మననం చేసుకుందాం...

ఆధ్యాత్మిక లోగిలి...

కోదండరాముని సన్నిధి

● ఏకశిలానగరి... ప్రముఖ పర్యాటక గిరి
● కోదండరాముని చరితం ఆద్యంతం రాగరంజితం

రాజంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఓ రామా.. కోదండ రామా... అని పిలిస్తే ఓ అంటూ భక్తులకు కనిపించి వారికి అభయం ఇచ్చే దేవుడిగా తరతరాల నుంచి కోదండరామునిపై భక్తుల్లో విశ్వాసం ఉంది. కడప జిల్లా కేంద్రానికి ఇటు రాజంపేటకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలో చెన్నై-కడప జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ ఆలయం అద్భుత శిల్పకళా సంపదతో మన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉంది. ఒకే రాతి గుట్టపై నిర్మింబడి మూడు గోపురాలతో 32 అద్భుత శిల్పమయ స్తంభాలతో రంగమండపం, కల్యాణమండపం ఈ ఆలయం సొంతం. సీతారామలక్ష్మణులు ఒకే శిలపై వెలసి ఉన్నందున ఒంటిమిట్ట ఏకశిలా నగరంగా పేరు గడించింది. హనుమంతుడు లేకుండా నిర్మించిన ఏకైక ఆలయం ఒంటిమిట్ట కోదండరామాలయం. మట్లి పాలకుల్లో ఒకరైన సదాశివరాయల కాలం నాటి శిలాశాసనాలను బట్టి చూస్తే ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని 1350 సంవత్సరంలో ఉదయగిరిని పాలించిన కంపరాయలు నిర్మించినట్లు తెలుస్తోంది. 1356లో ఉదయగిరి సింహాసనాన్ని అధిష్ఠించిన కంప సోదరుడైన బుక్కరాయలు ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని ప్రారంభించాడు. మట్లి రాజుల్లో ఒక్కడైన అనంతరాజు రామాలయ గుడిని విస్తరించాడు. తూర్పుగాలిగోపురం, మహామండపం, మహాప్రాకారం, రథం నిర్మించారు. అలాగే ఉత్తర, దక్షిణ గోపుర నిర్మాణాలు మొదలుపెట్టగా అనంతరాజు కుమారుడైన తిరువెంగళనాథరాజు మనవడు కుమార అనంతరాజు పూర్తి చేశాడు. ఒంటిమిట్ట కోదండరామాలయంలో రెండు శాసనాలు ఉన్నాయి. మొదటి శాసనం క్రీ.శ.. 1555లో, రెండవ శాసనం క్రీ.శ..1558లో వేయించారు. వీటి ప్రకారం విజయనగర పాలకుడు వీరసదాశివరాయల సామంతుడు గుత్తి తిరుమలయ్య దేవమహారాజు పులపత్తూరు గ్రామాన్ని ఆలయానికి దానంగా ఇచ్చాడు. కోదండరామాలయ ప్రాకార నిర్మాణాలకు, రథం, బ్రహ్మోత్సవాల నిర్వహణకు తిరుమల రాజయ్య, నాగరాజయ్య దేవమహారాజులు ఒంటిమిట్టను, చుట్టూ ఉన్న పల్లెలను, పొలాలను దానంగా ఇచ్చారు. ఈ రెండు శాసనాలను సదాశివరాయల మంత్రిగా ఉన్న తిరుమల రాజు అనుమతితో వేయించారు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేస్తూ ఒంటిమిట్టకు వచ్చినట్లు ఇతిహాసం చెబుతోంది. ఇక్కడ మునులు తపస్సులు చేసుకుంటూ ఉండేవారు. వీరికి



ఏకశిలపై కొలువైన సీతా, రామ, లక్ష్మణులు

మిగతా 6వ పేజీలో...

రామాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



బియ్యపు గింజలను తీసుకువస్తున్న రజని



ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ అర్చకులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలోని కోదండరామాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముందు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. కోదండరాముడి బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నాయి. మంగళవారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేలుకొల్పి అర్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భాలయం, ఆంజనేయస్వామి గుడి, గరుత్మంతుని సన్నిధి ఆలయ ప్రాంగణం, గోడలు పైకప్పు, పూజా సామగ్రి తదితర అన్ని ప్రదేశాలను అన్ని వస్తువులను శుద్ధి చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, మనోజ్‌కుమార్, సిబ్బంది, ప్రవీణ్‌కుమార్, నాయక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యపు గింజలపై శ్రీరామ నామం

కోదండరాముడి కల్యాణోత్సవానికి బియ్యపు గింజలపై శ్రీరామ నామం లిఖించిన తలంబ్రాలను భక్తులు ఆలయ అధికారులకు అందజేశారు. రాయచోటి ఆర్యవైశ్య సంఘానికి చెందిన రజని అనే భక్తురాలు బియ్యపు గింజలపై శ్రీరామ నామం లిఖించారు. మంగళవారం వీటిని అధికారులకు అందజేశారు. సుమారు 10,011 బియ్యపు గింజలపై శ్రీరామనామం లిఖించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మనోహర్‌బాబు, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సభ్యులు కిరణ్‌కుమార్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన

పదో తరగతి పరీక్షలు



గాలివీడులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వాప్తంగా 121 పరీక్షా కేంద్రాల్లో గత నెల 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరిగాయి. పరీక్షల సందర్భంగా 121 మంది డిపార్టుమెంటల్ అధికారులతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు అత్యంత పకడ్బందీగా పబ్లిక్ పరీక్షలను నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, శివప్రకాశ్‌రెడ్డి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పబ్లిక్ పరీక్షల సందర్భంగా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యా శాఖాధికారులు అన్ని రకాల సౌకర్యాలను పూర్తి చేశారు. పరీక్షల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూశారు.

పీలేరులో భారీ చోరీ

● మొత్తం రూ.50 లక్షలకు పైగానే..?
● రెండిళ్లలో రూ.9.50 లక్షల నగదు, 590 గ్రాముల బంగారు, 1.5 కేజీల వెండి అపహరణ



చోరీ జరిగిన ఇంటిలో వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు, వేలిముద్రల నిపుణులు

పీలేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పీలేరు-తిరుపతి మార్గంలోని చౌడేశ్వరి చేనేత నగర్‌లో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. తాళాలు వేసిన రెండు ఇళ్లలోకి చొరబడిన దుండగులు నగదు, బంగారు, వెండి కలిపి రూ.50 లక్షలకు పైగా చోరీ చేసినట్లు బాధితులు చెబుతున్నారు. రెండు ఇళ్లలో కలిపి రూ.9.5 లక్షల నగదు, 590 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.5 కేజీల వెండి ఆభరణాలను అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. చౌడేశ్వరి చేనేతనగర్‌లో కాపురముంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అశోక్ కుమార్, టీటీడీ విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసులు సమీప బంధువులు. సోమవారం ఆ రెండు కుటుంబాల వారు ఇళ్లకు తాళం వేసి మదనపల్లెలో జరుగుతున్న దైవకార్యంలో పాల్గొనేందుకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు సోమవారం రాత్రి వారి ఇళ్లలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. అయితే ఇద్దరి ఇళ్లకు సీసీ కెమెరాలు అమర్చి ఉండడం, వాటిని తమ సెల్‌ఫోన్లకు అనుసంధానం చేసుకుని ఉండడంతో మంగళవారం ఉదయం సీసీ కెమెరాలు ధ్వంసం అయినట్లు సమాచారం అందింది. దీంతో వారు పీలేరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్‌ఐ లోకేశ్ ఆ ఇళ్లను పరిశీలించి జిల్లా కేంద్రం నుంచి వేలిముద్రల నిపుణులను పిలిపించారు. అశోక్‌కుమార్ ఇంట్లో రూ.3.50 లక్షల నగదు, 90 గ్రాముల బంగారు ఆభరణాలు, శ్రీనివాసులు ఇంటిలో 500 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.5 కేజీల వెండి ఆభరణాలు, రూ.6 లక్షల నగదు అపహరణకు గురైనట్లు తేల్చారు. ఉగాది పండుగ ఉండడంతో బంగారు ఆభరణాలు ఇంట్లో పెట్టుకున్నట్లు అశోక్‌కుమార్, తండ్రి అనారోగ్యం కారణంగా గతంలో చేసిన అప్పును తీర్చేందుకు రుణంగా తీసుకున్న రూ.6 లక్షలు ఇంటిలో ఉంచినట్లు శ్రీనివాసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సైబర్ వల.. సామాన్యులు విలవిల

● అపరిచిత యాప్‌లతో వేట
● ఆకర్షణీయంగా మోసపూరిత ప్రకటనలు
● ఏమారితే బ్యాంకు అకౌంటు లూటీ

మీరు ఇంట్లో నుంచి కాలు బయటపెట్టకుండా వేలకు వేలు డబ్బు సంపాదించవచ్చు. మేము చెప్పినట్లు చేయండి.. మీ బ్యాంకు అకౌంటు మేము వాడుకుంటాం.. మీకు ఎంతో కొంత కమీషన్ ఇస్తాం. మీకు మంచి విలువైన గిఫ్ట్ వచ్చింది.. మేము పంపించే మెసేజ్‌ను క్లిక్ చేయండి.. మీ అకౌంటులో డబ్బు పడుతుంది.. వంటి మోసపూరిత ప్రకటనల వల్ల ఎందరో ప్రజలు అత్యాశకు గురై సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుకుని డబ్బులు పోగొట్టుకుని విలవిల్లాడుతున్నారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్టు ద్వారా ప్రజలకు కాల్ చేసి రకరకాలుగా భయపెడుతున్నారు. మొదట తాము టార్గెట్ చేసిన వారికి ఫోన్ చేసి నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల శాఖ) నుంచి కాల్ చేస్తున్నామంటూ సాధారణ ఫోన్ కాల్ చేస్తారు. తరువాత మీ కుమారుడు, కుమార్తె పేరు మీద డ్రగ్స్ పార్శిల్ అయ్యాయి.. మేము దీనిపైన కేసు నమోదు చేశాము అంటూ వీడియో కాల్ చేసి బ్యాక్ గ్రౌండ్‌లో పోలీసు లోగో, యూనిఫాంతో ఉన్న వాళ్లు నిజమైన పోలీసులు అన్నట్టుగా హడావుడి చేసి నమ్మిస్తారు. ఈ కేసు నుంచి మీ వాళ్లను తప్పించాలంటే మేము చెప్పిన అకౌంటుకు డబ్బు వేయమని చాలా తక్కువ సమయం ఇచ్చి అమౌంటు వేయించుకుంటారు. అంతటితో ఆగకుండా తర్వాత మీ వాళ్లకు అరెస్టు వారెంటు ఇష్యూ అయిందంటూ భయపెట్టి చాలా డబ్బు కోసం ప్రయత్నిస్తారు. ఇటువంటి సంఘటనలు ఇటీవల చాలా జరిగాయి. పోలీసు కేసు నమోదైతే పోలీసులు స్వయంగా వచ్చి విచారిస్తారన్న కనీస అవగాహన లేకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడి కోట్లాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు.



● కొందరు సైబర్ నేరగాళ్లు టెక్ సపోర్ట్ స్కాంకు పాల్పడతారు. ఇందులో మోసగాళ్లు ప్రముఖ టెక్ కంపెనీల టెక్నికల్ సిబ్బందిగా నటిస్తారు. మన కంప్యూటర్ లేదా ఇతర పరికరాలలో సమస్యలను పరిష్కరించడానికి సహాయం చేస్తామని చెప్పి.. మన వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని దొంగిలించడానికి ప్రయత్నిస్తారు.

● ఏదైనా వాట్సప్ గ్రూపులలో, టెలిగ్రామ్ గ్రూపులలో మనకు తెలియని క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసే ముందు జాగ్రత్తగా ఆలోచించాలి. గిఫ్ట్‌కార్డులు, డిస్కౌంట్ల కోసం క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయకూడదు. వాట్సప్, క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మన ఫోన్ హ్యాక్ కావొచ్చు. దీంతో మన వ్యక్తిగత సమాచారం చోరీకి గురి కావచ్చు

● ఆన్‌లైన్ ట్రేడింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో డబ్బు పెట్టడం అంటే మన బ్యాంకు ఖాతాకు మనమే కన్నం వేసుకున్నట్లు. యాప్ నిర్వాహకుల నియంత్రణలో జరిగే ట్రేడింగ్, బెట్టింగ్ యాప్‌లలో మనం డబ్బు గెలవడం అసాధ్యం.

● ఇంట్లో ఉంటూనే వేలల్లో సంపాదించవచ్చనే ప్రకటనలను నమ్మకూడదు. తొలుత సైబర్ మోసగాళ్లు ఆన్‌లైన్ టాస్క్‌లతో ముగ్గులోకి దించుతారు. మొదట్లో లాభం ఎరచూపి తర్వాత సర్వం దోచేస్తారు. పార్ట్‌టైమ్ జాబ్ అంటూ మోసం చేస్తారు. ఎక్కువగా ఇళ్లలో ఉండే గృహిణులు, చదువుకునే విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడతారు.

రుణ మోసాలు

ఎక్కువమంది మోసపోయేది ముఖ్యంగా నకిలీ రుణాలతో.. ఫేక్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం సృష్టించి ఎటువంటి గ్యారెంటీ లేకున్నా రుణాలు ఇస్తామంటూ మోసం చేస్తారు. మన బ్యాంకు ఖాతాలను యాక్సిస్ చేయడం ద్వారా మనకు తెలియకుండానే సొమ్ము దొంగిలిస్తారు. లోన్ యాప్స్ డౌన్‌లోడ్ చేసే సమయంలో ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ, మెసేజ్ వంటి వాటికి యాక్సిస్ ఇస్తే... మీ వ్యక్తిగత డేటా మొత్తం వాళ్ల చేతుల్లోకి వెళుతుంది. బ్యాంకు అధికారులుగా నమ్మించి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి ఓటీపీలు తెలుసుకుని మోసాలకు పాల్పడతారు.

అప్రమత్తతే పరిష్కారం

ఇటువంటి సైబర్ మోసాలకు అప్రమత్తతే పరిష్కారమని పోలీసులు పేర్కొంటున్నారు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సైబర్ వలకు చిక్కకుండా తప్పించుకోవచ్చని చెబుతున్నారు. వాట్సప్‌లో మన కుటుంబం ఫొటోలను ప్రొఫైల్ ఫొటోగా పెట్టుకోకూడదు. మన వ్యక్తిగత డీటైల్స్‌ను అనవసరంగా ముక్కుమొఖం తెలియని వారికి ఇవ్వకూడదు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదు. వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో గోప్యంగా ఉంచాలి. మన కుటుంబంతో ఎక్కడికైనా వెళ్లినపుడు ఆ సమాచారాన్ని అనవసరంగా బహిరంగపరచకూడదు. మన మెయిల్‌కు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఈ-మెయిల్, మెసేజ్‌లను ఎటువంటి పరిస్థితుల్లోనూ తెరవకూడదు. మన ఫోన్‌కు ఇంటర్నేషనల్ నెంబర్ల నుంచి వచ్చే కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలి. అపరిచిత నెంబర్ల నుంచి వచ్చే వీడియో కాల్స్‌కు దాదాపు స్పందించకూడదు.

అత్యాశకు పోవద్దు... ఆపద కొనితెచ్చుకోవద్దు



ఉచితంగా, సులభంగా డబ్బు సంపాదించవచ్చు. మీరు విలువైన బహుమతులు గెలుచుకున్నారు అని వచ్చే ఈ-మెయిల్, మెసేజ్‌లకు స్పందించవద్దు.. డబ్బు కోసం అత్యాశకు పోయి ఆపదను కొనితెచ్చుకోవద్దు. మీ మీద నిజంగా ఏదైనా పోలీసు కేసు నమోదై ఉంటే సంబంధిత పోలీసులే నేరుగా వస్తారు. వాట్సప్ కాల్ చేయరు. అలా చేస్తే వాళ్లు కచ్చితంగా సైబర్ నేరగాళ్లే. కమీషన్‌కు ఆశపడి మీ బ్యాంకు అకౌంటును ఎవరికీ అమ్ముకోవద్దు. సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోండి. సైబర్ మోసాల బారినపడితే తక్షణమే 1930కు ఫిర్యాదు చేయండి.

- వి.విద్యాసాగర్‌నాయుడు, ఎస్పీ


పట్టాభిరాముడి వైభవం

చూతము రారండి...

● నేడు అంకురార్పణ.....
● టీటీడీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు




సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడు



పట్టాభి రామాలయం రాజగోపురం

వాల్మీకిపురం, ఏప్రిల్ 1: వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది వైభవంగా నిర్వహించేలా టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. శ్రీరామచంద్రమూర్తి వాల్మీకి మహర్షికి దివ్య దర్శన భాగ్యాన్ని కలిగించిన ప్రాంతం వాల్మీకిపురం. అత్యంత ప్రాచీన ప్రాశస్తి కలిగిన పట్టాభిరామాలయంలో లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమంత, సీతాసమేతంగా పట్టాభిరాముడిని పరమ నిష్ఠాగరిష్ఠులైన జాంబవంతుడు ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. వాల్మీకం (పుట్ట) నుంచి శ్రీరామచంద్రమూర్తి బయటపడినందున ఈ ప్రదేశం వాల్మీకిపురంగా ప్రసిద్ధి చెందింది. పట్టాభిరాముడికి దక్షిణ హస్తమున గ్రాసముద్ర, వామ హస్తమున వరద ముద్రతో (వైకుంఠ హస్తము) తేజోవిరాజితులై ఉన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో రంగవల్లికలు, చలువ పందిళ్లు విద్యుత్ దీపాలంకరణలు భక్తులకు సౌకర్యాలు టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 2వ తేదీ బుధవారం సాయంత్రం పట్టాభిరాముడికి అంకురార్పణ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు తెలిపారు. 3న గురువారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం గజవాహన సేవ, 8న సోమవారం సాయంత్రం సీతారాముల కల్యాణం, రాత్రికి గరుడ వాహన సేవ ఉంటాయి.

వాల్మీకిపురానికి 'మహర్షి' ముద్ర...



వాల్మీకిపురం వానరకొండల ప్రాంతంలో వాల్మీకి మహర్షి తపోదీక్ష చేస్తున్నట్లు కనిపిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం పట్టణ పరిసరాల్లోని శతశృంగ పర్వతాల్లో వాల్మీకి మహర్షి తపస్సు ఆచరించినట్లు చరిత్ర చెబుతోంది. శతశృంగ పర్వతాల్లో వాల్మీకిపురం మహర్షి తపస్సు ఆచరించడం వాల్మీకిపురం అనే పేరు రావడం, నేటికీ పట్టణ సమీపంలోని వానరకొండల ప్రాంతంలో వాల్మీకి మహర్షి తపోదీక్ష చేస్తున్నట్లు ఉండే రాయి నేటికీ దర్శనమిస్తోంది. జాతీయ రహదారి పక్కగా కనిపించే ఈ దృశ్యాన్ని చూసి భక్తులు మంత్రముగ్ధులవుతుంటారు.

ఆధ్యాత్మిక లోగిలి.. కోదండరాముని సన్నిధి..

(5వ పేజీ తరువాయి)

రాక్షసుల బెడద ఎక్కువగా ఉండటంతో యజ్ఞయాగాదులు నిర్వహించలేకపోయారు. మహాముని కోరికపై శ్రీరామలక్ష్మణులు రాక్షస సంహారం చేసిన అనంతరం మునుల యజ్ఞయాగాదులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఒకే శిలలో నిర్మితమైన సీతారామలక్ష్మణ విగ్రహాలను మునులకు ప్రదానం చేశారట. ఈ విగ్రహాలు మూడు విడివిడిగా కనిపించినా ఇవన్నీ ఒకే శిలపై ఆవిర్భవించి ఉన్నందున ఒంటిమిట్టకు ఏక శిలా నగరం అని పేరు వచ్చింది. అరణ్యవాసంలో భాగంగా శ్రీరాముడు అమ్ములపొది, పిడిబాకు, కోదండం చేతపట్టి రావడంతో కోదండరాముడు అనే నామం వచ్చింది.

ఓ మధురానుభూతి...

కోదండరాముడి ఆలయాన్ని సందర్శించడం ప్రతి ఒక్కరికీ మధురానుభూతిని కలిగిస్తుంది. ఇక్కడి కోదండరామాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఒక అద్భుత దృశ్యం గోచరమవుతుంది. ఒక ఎత్తయిన పీఠంపై ఉన్న ఆలయం.. చుట్టూ చిన్న, పెద్ద గుట్టలు కనిపిస్తాయి. ఆ గుట్టలన్నీ పుష్పరేకులు గానూ.. మధ్యలో ఉన్న దేవాలయం కర్ణికగా అమరి ఉండటం ప్రత్యేకత. ఎంతో చారిత్రక, మరెంతో ప్రాధాన్యం కలిగిన ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని సందర్శించడం మధురానుభూతిని కలిగిస్తుంది. కోదండరాముడి సేవలో ఎందరో మహానుభావులు తరించేవారని చరిత్ర చెబుతోంది.

సాహితీ ఉద్దండుడు బమ్మెర పోతనామాత్యుడు, తిప్పయ్య, అయ్యలరాజు రామభద్రుడు, తిప్పకవి, మాల ఓబన్న, ఆంధ్రా వాల్మీకి వావిలకొలను సుబ్బారావు, నల్లకాల్వ అయ్యప్ప, ఉప్పుగొండూరు వెంకటకవి, తాళ్లపాక అన్నమాచార్య, పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వంటి కవులు, భక్తులు, మహనీయులు ఎందరో రామయ్య సేవలో తరించిన వారే. మహాభాగవతాన్ని తనకు అంకితమివ్వమని పోతనను శ్రీరాముడు కోరినది ఇక్కడేనని ప్రతీతి.



ఒంటిమిట్ట కోదండరామాలయంలోని అపురూప శిల్పకళాసంపద

ఇమాంబేగ్ పిలుపు.. రామయ్య పలుకు...

క్రీ.శ..1640 ప్రాంతంలో కడపను పాలించిన అబ్దుల్ నబీఖాన్ ప్రతినిధి ఇమాంబేగ్ ఒంటిమిట్ట కోదండరాముడి మహిమను పరీక్షించేందుకు వచ్చాడట. గుడి లోపలికి వెళ్లి ఓ రామా..! ఒంటిమిట్ట రఘురామ..! అని మూడుమార్లు పిలువగా గుడి లోంచి ఓ..ఓ..ఓ.. అనే సమాధానం వినపడింది. దాంతో ఇమాంబేగ్ ఆనందంతో మోకరిల్లి రాముడి భక్తునిగా మారాడు. శ్రీరాముని కైంకర్యం కోసం ఒక బావిని కూడా తవ్వించారు. ఆలయం వద్ద ఆ బావిని నేటికీ చూడవచ్చు. అందువల్లే ప్రతి శుక్రవారం ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె దర్గాకు వెళ్లే ముస్లింలు తిరిగి వస్తూ కోదండరాముడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

అపురూప శిల్పసంపద

ఒంటిమిట్ట కోదండరామాలయంలోని అపురూప శిల్పసంపద భక్తులను మైమరపిస్తుంది. రంగమండపంలోని 32 శిలా స్తంభాల్లో మూడు ముఖాలు కలిగిన అపురూప శిల్పాలు రామాయణ, భాగవతాలను, నాటి పాలకుల రసజ్ఞతలను ప్రదర్శిస్తున్నాయి.

జాంబవంత ప్రతిష్ఠ

త్రేతాయుగంలో ఒంటిమిట్ట ప్రాంతానికి వచ్చిన జాంబవంతుడు ఒకనాటి రాత్రి విశ్రమించగా స్వప్నంలో సీతారామలక్ష్మణులు దర్శనమిచ్చారట. జాంబవంతుడు ఉదయమే లేచి పరిసరాల్లో వెతకగా ఒక గుబురు పొదల్లో సీతారామ లక్ష్మణ విగ్రహాలు కనిపించాయి. దాంతో జాంబవంతుడు ఆనందభరితుడై మంత్రోచ్చారణలతో సీతారామలక్ష్మణ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అందువల్లే జాంబవంత ప్రతిష్ఠ అని పేరు వచ్చింది.

రామ లక్ష్మణ బాణాలకు వెలసిన తీర్థాలు

అరణ్యవాసంలో భాగంగా పర్యటించిన సీతారామలక్ష్మణులు అలసి ఒక చెట్టునీడన చేరారు. ఆ సమయంలో సీతాదేవికి దాహంగా ఉండటంతో శ్రీరాముడు బాణాన్ని భూమిలోకి సంధించగా పాతాళం నుంచి గంగ పెల్లుబికింది. దీంతో ముగ్గురు దాహం తీర్చుకున్నారు. అదే సమయంలో లక్ష్మణుడు కూడా భూమిలోకి బాణం సంధించగా గంగ ఉద్భవించింది. అప్పటి నుంచి ఇవి శ్రీరామలక్ష్మణ తీర్థాలుగా ప్రసిద్ధి చెందాయి.



చంద్రబాబు నిలిపిన ప్రాణానికి

నారా లోకేశ్ అండ

● చిన్నారి జ్ఞానసాయికి పింఛను మంజూరు ● చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చిన్నారికి పింఛను పంపిణీ చేస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలిపిన ప్రాణానికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. 2016లో కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి జ్ఞానసాయి ప్రాణాలు కాపాడేందుకు అప్పట్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చూపిన చొరవ ఇప్పటికీ అందరికీ గుర్తుండిపోయింది. నిస్సహాయ స్థితిలో జన్మనిచ్చిన తల్లిదండ్రులే బిడ్డను చంపుకునేందుకు సిద్ధమైన సమయంలో చంద్రబాబు ప్రభుత్వ సాయంతో వైద్య, శస్త్ర చికిత్స అందించి ఆ ఇంటి దీపం ఆరిపోకుండా చేశారు. ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ ఆర్ఎస్ కొత్తపల్లెకు చెందిన జల్లా రమణప్ప, సరస్వతి దంపతులు తమకున్న రెండు ఎకరాల్లో పూల సాగు చేస్తూ జీవనం సాగించేవారు. వీరి మొదటి సంతానం జ్ఞానసాయికి పుట్టుకతోనే కాలేయ వ్యాధి సోకింది. మదనపల్లె, తిరుపతి, బెంగళూరులోని పలు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించారు. బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో ఎనిమిది నెలల వయస్సులో రూ.5 లక్షలు ఖర్చు చేసి శస్త్ర చికిత్స చేయించగా అది వికటించింది. దీంతో పాపను బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా కాలేయ మార్పిడి చేయాలని, దీనికి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అంత డబ్బు ఖర్చు చేసి బిడ్డను బతికించుకోలేమని మెర్సీ కిల్లింగ్ (కారుణ్య మరణానికి) అనుమతి కోరుతూ తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించిన ఈ హృదయ విదారకర సంఘటన 2016 సంవత్సరం జూన్ నెలలో రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పాప ఆరోగ్య పరిస్థితిపై చలించిపోయారు. తక్షణం స్పందించి శస్త్ర చికిత్సకు అయ్యే ఖర్చు పూర్తిగా భరిస్తామని ప్రకటించి చిన్నారికి చెన్నైలోని గ్లోబల్ ఆస్పత్రిలో ప్రపంచ ప్రఖ్యాత వైద్య నిపుణుడు మహ్మద్ రేలా శస్త్ర చికిత్స చేశారు. తండ్రి రమణప్ప కాలేయాన్ని తీసి చిన్నారికి అమర్చారు. పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో చేయించిన ఈ శస్త్ర చికిత్స విజయవంతమై పాప కోలుకుంది. శస్త్ర చికిత్స, వైద్య పరీక్షల కోసం అప్పట్లో రూ.35 లక్షల వరకు ఖర్చయింది అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిన్నారికి పింఛను మంజూరు చేసి తండ్రికి తంబళ్లపల్లెలోని ఎస్టీ హాస్టల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించి అండగా నిలిచారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2022లో జ్ఞానసాయి పింఛను తొలగించింది. పాప పరిస్థితి చూసి పింఛను మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. ఈ క్రమంలో 2023 మార్చి నెలలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగిన యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌ను జ్ఞానసాయి కుటుంబం కలిసి విషయాన్ని వివరించింది. పాపకు ప్రతి నెలా మందులకు రూ.20 వేలు ఖర్చు అవుతుందని, పింఛను పునరుద్ధరిస్తే ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని జ్ఞానసాయికి కచ్చితంగా పింఛను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి విషయాన్ని ఇటీవల మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సూచనలతో ప్రభుత్వం జ్ఞానసాయికి ఏప్రిల్ నుంచి రూ.10 వేలు చొప్పున ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛను మంజూరు చేసింది. దీంతో మంగళవారం జయచంద్రారెడ్డి ఆ బాలికకు పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారి జ్ఞానసాయి, కుటుంబీకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ములకలచెరువులోని శారదా విద్యామందిర్‌లో బాలికకు సీటు ఇప్పించి ఉచితంగా విద్య అందిస్తానని ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ప్రకటించారు. పాఠశాల కరస్పాండెంట్ సనత్‌కుమార్‌తో మాట్లాడి అడ్మిషన్ ఇప్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నేతలు మూగి రవిచంద్ర, ఆంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలాజీ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి వాల్మీకిపురంలో జరిగింది. పట్టణానికి సమీపంలోని ఓ కాలనీకి చెందిన బాలికపై జేసీబీ డ్రైవర్‌గా పనిచేసే అశోక్ అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



రామసముద్రం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించడం లేదని మండలంలోని అరికెల పంచాయతీ నాగపల్లెకు చెందిన గణేశ్ మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మార్చి 31న తన భార్య మౌనిక (20) ఇంటి నుంచి వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొనడంతో, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. కోటకొండకు చెందిన వెంకటరమణ కుమారుడు వంశీకుమార్ సంగం పాల డెయిరీలో పనిచేస్తాడు. పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా బెస్తపల్లె సర్కిల్ వద్ద బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో వంశీకుమార్‌కు, బొలెరో డ్రైవర్ ఖాజాపీర్ గాయపడ్డారు. వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సిలిండర్ లారీ బోల్తా : తప్పిన ప్రమాదం



బోల్తా పడ్డ సిలిండర్ల లారీ

సంబేపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని సంబేపల్లె టౌన్ వడ్లపల్లి క్రాస్ వద్ద మంగళవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ లోడ్‌తో కడప నుంచి నిమ్మనపల్లికి వెళుతున్న లారీ సంబేపల్లె వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఎటువంటి మంటలు వ్యాపించకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సిలిండర్లను మరొక లారీలోకి బదిలీ చేయించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో ఒకవైపు వాహనాలు వెళ్లేలా పోలీసులు దగ్గరుండి చర్యలు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు... పట్టణంలోని ఆరాధ్య ఆస్పత్రికి సమీపంలోని ప్రధాన దారి పక్కనే నివాసం ఉంటున్న పెనుబాల వెంకటరమణ (47) అనే వ్యక్తి బార్బర్ షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా భార్య, బిడ్డలతో దూరంగా ఉంటున్నాడని బంధువులు తెలిపారు. ఆదివారం రాత్రి మద్యం తాగి మిద్దెపై నిద్రించాడు. మిద్దెకు అవతలి వైపు గోడ లేని కారణంగా దొర్లుకుని కిందపడడంతో మృతి చెంది ఉంటాడని బంధువులు అంటున్నారు. మృతుడికి భార్య చాముండేశ్వరి, కుమారులు గోపీచంద్, దినేష్‌కార్తీక్‌లు ఉన్నారు. వెంకటరమణ మద్యం తాగి మిద్దెపైనుంచి ప్రమాదవశాత్తు పడ్డాడా? లేక ఎవరైనా తోసి ఉంటారా? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంఘిక సంక్షేమ అధికారి డిప్యుటేషన్ పొడిగింపు

కలికిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా షెడ్యూల్డ్ క్యాస్ట్స్ సర్వీసు కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీఎస్‌సీఎస్‌సీఎస్) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డెప్యుటేషన్‌లో ఉన్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి (డీఎస్‌డబ్ల్యూఓ) ఆర్.రవీంద్రనాథరెడ్డి డెప్యుటేషన్ గడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మార్చి 22 నుంచి 2026 జూన్ 30 వరకూ వర్తించే విధంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు ప్రభుత్వం పంచ ప్రాధాన్యాల లక్ష్యాన్ని నిర్దేశించిందని ఈ మేరకు వివిధ అభివృద్ధి పథకాలను చేపడుతున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా నిర్దేశించిన పంచ ప్రాధాన్యాలలో భాగంగా పశువుల నీటితొట్టెలు, ఫారంపాండ్ల నిర్మాణం, పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత, ఉపాధి కూలీలకు సగటు వేతనం రోజుకు కనీసం రూ.290 ఉండేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు 2025-26 మొదటి త్రైమాసికానికి రూ.266 కోట్ల లక్ష్యంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు. ఇందులో రూ.85.52 కోట్ల అంచనాతో 11 వేల ఫారంపాండ్ల నిర్మాణం, రూ.21.71 కోట్ల అంచనాతో పంట కాలువల్లో పూడికతీత, రూ.3.47 కోట్ల అంచనాతో 1034 పశువుల నీటి తొట్టెల నిర్మాణం, రూ.5.56 కోట్ల ఖర్చుతో సాగునీటి చెరువుల్లో పూడిక తీయడం, రూ.150.43 కోట్ల అంచనాతో వేతన జీవులకు 49 లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా కృషి చేస్తామని తెలిపారు.

జిల్లాలో నీటి ఎద్దడి నివారించడానికి రూ.7.95 కోట్లతో ప్రణాళికను ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 116 గ్రామాల్లో నీటి సరఫరా జరుగుతోందన్నారు. వేసవి దృష్ట్యా రాబోయే కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో రూ.243.74 కోట్ల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటరత్నం, పంచాయతీరాజ్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి




రైల్వేకోడూరు ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట వడ్డిపల్లెకు చెందిన చామల సుబ్బరాయుడు (47) గత నెల 23న తలకు పూసుకునే రంగు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. అనంతరాజుపేట వడ్డిపల్లెకు చెందిన సుబ్బరాయుడు భార్యకు దూరంగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తలకు పూసుకునే రంగు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కూటమి జెండా పైపు ధ్వంసం

● జెండాలు కాల్చివేత

● పోలీసులకు ఫిర్యాదు చేసిన నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ ఎగువ సుగాలి తాండాలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు కూటమి జెండా ఉన్న పైపును ధ్వంసం చేసి, జెండాలను కాల్చివేశారు. స్థానిక నాయకులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 30న బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేంద్రనాయక్, కూటమి నాయకులతో కలసి జెండా దిమ్మె ఏర్పాటు చేసి కూటమి జెండాలను ఆవిష్కరించారు. మరుసటి రోజు సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జెండా దిమ్మెకు ఉన్న పైపును ధ్వంసం చేసి జెండాలను కాల్చివేశారు.

మంగళవారం ఉదయం మండల టీడీపీ, బీజేపీ అధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి, వెంకటరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించి నిరసన తెలిపి సంఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లోకేశ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి కాలా నారాయణ, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, గురుమూర్తి, బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివానాయక్, వెంకటేష్ నాయక్, వీరభద్రనాయక్, కోన భాస్కర్, వైవీ రమణారెడ్డి, డాన్స్ రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగి మృతికి పరిహారం

కలికిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వర్క్‌షాపులో కాంట్రాక్టు అటెండరుగా ఉద్యోగం చేస్తూ ఆకస్మికంగా మృతి చెందిన వై.ఉమా మల్లికార్జున దేవరాయలుకు పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 అక్టోబరు 14న విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందాడు. అధికారులు నిర్ణీత వ్యవధిలో ప్రభుత్వానికి సమాచారం సమర్పించడంతో మృతుడి భార్య వై.నాగమ్మకు ప్రభుత్వం రూ.2 లక్షలు నిధులు విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా దీనికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ఎర్రచందనం కేసులో ఐదేళ్ల జైలుశిక్ష



జైలుశిక్ష పడ్డ నిందితుడు సత్యమోహన్

రామాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముద్దాయి సత్యమోహన్‌కు ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహామూర్తి మంగళవారం తీర్పునిచ్చారని రాయచోటి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17-5-2019వ తేదీ రామాపురం మండలం పత్తి కనుమ రస్తా, సరస్వతిపల్లి బీట్, వంగిమళ్ల సెక్షన్, రాయచోటి రేంజ్‌లో ఒక సుమోలో నాలుగు ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న డ్రైవర్ సత్యమోహన్‌ను అరెస్టు చేసి కేసు కోర్టులో హాజరు పరిచి రాయచోటి సబ్‌జైలుకు తరలించారన్నారు. మంగళవారం జరిగిన తీర్పులో ముద్దాయికి శిక్ష పడటంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారని ఫారెస్టు తెలిపారు.

మిడిమానుకొండకు నిప్పు



మంటలు ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది, రైతులు

గుర్రంకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల ఆగడాలకు కొండలు, గుట్టలు కాలిబూడిదవుతున్నాయి. గుర్రంకొండ పట్టణంలోని ఇందిరమ్మకాలనీ సమీపంలో మిడిమానుకొండ ఉంది. ఈ కొండకు సోమవారం రాత్రి ఆకతాయిలు నిప్పంటించారు. దీంతో కొండ మొత్తం కాలిపోయి కొండ కిందున్న పొలాల్లోకి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో రైతులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించిన సాధ్యం కాలేదు. దీంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు పొలాల్లోకి వ్యాపించకుండా అదుపు చేశారు. అప్పటికే కొంత మంది రైతుల పొలాల్లో మామిడి, అల్లనేరుడు చెట్లు దెబ్బతినట్లు రైతులు వాపోతున్నారు.

రాయచోటిలో గ్యాంగ్ వార్

● రెండు వర్గాల మధ్య ఘర్షణ

● 9 మందిపై కేసు నమోదు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో గత కొంత కాలంగా గ్యాంగ్ వార్ నడుస్తోంది. ఈ క్రమంలోనే పాత కక్షలను మనసులో పెట్టుకుని సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో రెండు గ్యాంగ్‌లు రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ చెక్‌పోస్టు సమీపంలో జాతీయ రహదారిపై హల్‌చల్ చేశాయి. కత్తులు, కట్టెలతో ఘర్షణకు దిగడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై రాయచోటి అర్బన్ పోలీసులు 9 మందిపై 307, 324 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ప్రాంతానికి చెందిన దేశ్‌ముఖ్ రియాన్, దేశ్‌ముఖ్ ఇస్రాన్ అన్నదమ్ముల గ్యాంగ్‌కు, అదే ప్రాంతానికి చెందిన నిస్సార్ అలియాస్ డాకు మహరాజ్, చాను, నూర్ గౌస్‌ల మధ్య పాత కక్షలు ఉండేవి. ఈ క్రమంలో ముందుగా సోమవారం రాత్రి దేశ్‌ముఖ్ రియాన్, దేశ్‌ముఖ్ ఇస్రాన్, అహ్మద్ తదితరులు కలిసి చాను, నూర్‌లపై దాడి చేశారు. దీంతో వారిరువురూ కలిసి జరిగిన విషయాన్ని తమ గ్యాంగ్‌కు సంబంధించిన ఎస్ఆర్ అలియాస్ డాకు మహరాజుకు సమాచారం ఇవ్వడంతో వారు తమ గ్యాంగ్‌తో కలిసి 30 మందికిపైగా రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీకి చేరుకొని అక్కడున్న ఇమ్రాన్, రియాన్ అహ్మద్‌లపై కత్తులు, కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అయితే ఎస్ఎన్ కాలనీలో రెండు గ్యాంగ్‌ల మధ్య పెద్ద ఎత్తున గొడవ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో దాడికి పాల్పడ్డ వారు వాహనాల్లో పరారయ్యారు. ఈ క్రమంలో నిస్సార్ అలియాస్ డాకు మహరాజ్ మరికొంత మంది కలిసి ఇన్నోవా కారులో కడప వైపు వెళుతూ రింగు రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీల్లో ఉన్న పోలీసు వాహనాన్ని ఢీకొని పరారయ్యారు. గతంలో వీరంతా ఒక పట్టణ టీడీపీ నాయకుడి వద్ద ఉండేవారని సమాచారం. గతంలో జరిగిన గొడవల్లో పోలీసులు చితకబాదడంతో ఆ నాయకుడు వారిని పట్టించుకోకపోవడంతో వారంతా ఆయన నుంచి విడిపోయి ప్రస్తుతం మరో టీడీపీ నాయకుడి వద్దకు వద్ద చేరి గ్యాంగ్ వార్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు నిస్సార్ అలియాస్ డాకు మహరాజ్ చాన్‌నూర్, ఫయాజ్ ఖాన్ తదితర 9 మందిపై పోలీసులు 307, 324 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటచలపతి తెలిపారు.

ఇకపై మోత ఉండదు

- తగ్గనున్న బ్యాగుల భారం
- పాఠ్యపుస్తకాల భారంపై ప్రభుత్వం దృష్టి
- పుస్తకాల సంఖ్య కుదించేందుకు నిర్ణయం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలులోకి..



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్కూలు పిల్లల పుస్తకాల బరువు ఇకపై తగ్గనుంది. వీపుపై బ్యాగుల భారాన్ని మోస్తున్న చిన్నారులకు త్వరలో ఊరట లభించనుంది. బడి పిల్లలకు గుదిబండలా మారిన బ్యాగుల బరువును తగ్గించడం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. జనవరిలో విద్యాశాఖపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో స్కూల్ పుస్తకాల బరువుపై సంబంధిత అధికారులు మంత్రి నారా లోకేష్ ఎదుట కొత్త ప్రతిపాదనలు ఉంచారు. వీటిపై విద్యాశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. వాచకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్, డైరీలు ఇలా రకరకాల పేర్లతో పిల్లలు తమ శక్తికి మించిన భారాన్ని మోస్తున్నారు. కొంత మంది తల్లిదండ్రులు ఈవిషయాన్ని పెదగా పట్టించుకోకపోయిన, మిగతా వారు తీవ్రంగా పరిగణించి పిల్లలపై భారాన్ని తగ్గించాలని ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థుల పుస్తకాలు బ్యాగులపై స్టడీ చేసిన పలు కమిటీలు ప్రభుత్వానికి వివిధ సూచనలు చేశాయి. ఏ తరగతి విద్యార్థులకు ఏ మేరకు పుస్తకాల బ్యాగుల బరువు ఉండాలన్న దానిపై ఒక నివేదికను రూపొందించాయి. ఆ సూచనల ప్రకారం పిల్లల బరువులో వారు మోసే పుస్తకాల బరువు పది నుంచి పదైదు శాతానికి మించకూడదు.

తరగతుల వారీగా చూస్తే.... 1,2 తరగతులకు 1.50 నుంచి 2కిలోలకు మంచి బరువు ఉండకూడదు. 3 నుంచి 5 తరగతులకు రెండు నుంచి మూడు, 6,7,8 తరగతులకు 3 నుంచి 4కిలోలు, 9,10 తరతగతులకు 4 నుంచి 5 కిలోలకు మించి బరువు ఉండకూడదు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎదుట ఉంచిన ప్రతిపాదనల ప్రకారం ప్రతి సబ్జెక్టుకు ఒక పుస్తకానికి బదులుగా, కొన్ని సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంగా ముద్రిస్తారు. ప్రాథమిక స్థాయిలో మొత్తం సబ్జెక్టులు ఒకే పుస్తకంలో ఉంటాయి. పై తరగతుల్లో కూడా ప్రస్తుత ఉన్న పుస్తకాలను సగానికి తగ్గించి, రెండు మూడు సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంగా తెస్తారు.

ఈ ప్రతిపాదనలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, విమర్శలకు తావు లేకుండా తగిన విధానం రూపొందించి అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ ప్రతిపాదనలు యదావిధిగా అమలైతే ఇకపై పాఠశాల విద్యార్థులపై పుస్తకాల మోత భారం తగ్గనుంది. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభానికి ఇంకా రెండు నెలల సమయం ఉన్నందున కొత్త ప్రతిపాదనలు అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గతంలో ఇలా...

ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులకు బోధించాలి. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్ మినహా ఇతర పాఠ్యాంశాలను బోధించకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసులు, రివిజన్ టెస్టుల పేరుతో సాధారణ పాఠ్యపుస్తకాలతో పాటు సంస్థల పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందిగా తల్లి దండ్రులకు సూచిస్తున్నాయి. దీంతో పాటు అదనంగా రాసిన పుస్తకాలను పాఠశాలలోనే కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. బయట కొంటే అవి అనర్హమైనవని సాకులు చెబుతూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

బ్యాగుబరువు అయితే అనర్థాలివే..

విద్యార్థులు అధిక బరువు మోయడం వల్ల నడుం, వెన్ను, కండరాల నొప్పికి గురవుతారు. మానసిక ఆందోళన పెరుగుతుంది. చదువుపై దృష్టిపెట్టలేరు. జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. ఆకలి వేయదు. పుస్తకాలను చూడగానే ఆందోళనకు గురవుతారు. పాఠశాలకు వెళ్లే ముందు, వచ్చిన తర్వాత అసహనానికి లోనవుతారు. వీటిని గుర్తించిన విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ నిపుణులతో చర్చించి బ్యాగులు బరువు తగ్గించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను కూడా రూపొందించారు.

మీ సేవలు చిరస్మరణీయం



పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు పోలీసుశాఖకు విశేష సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మార్చి నెలాఖరున పదవీ విర మణ పొందిన కడప వన్‌టౌన్ ఏఎస్‌ఐలు పి.రాముడు, ఆర్.రాముడు, కడప డీఏఆర్ ఏఆర్ ఎస్‌ఐ జి.చంద్రశేఖర్‌లను ఎస్పీ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో చేరినప్పటి నుంచి నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతూ పదవీ విరమణ పొందడం అదృష్టమన్నారు. విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగానంతరం గుర్తుండిపోయేలా మంచి పేరుప్రఖ్యాతులు తెస్తాయన్నారు. పదవీ విరమణ పొందిన తరువాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీసుశాఖ ఎల్లవేళాల ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమ ణయ్య, ఆర్‌ఐలు టైటస్, వీరేశ్, శివరాముడు, డీపీవో ఏవో జ్యోతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల దాహార్తి తీర్చేందుకే నీటి తొట్లు



కొండపేటలో పశువుల తొట్టికి శంకుస్థాపన చేస్తున్న డ్వామా పీడీ

చెన్నూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో పశువులు దాహార్తితో ఇబ్బంది పడకుండా నీటి తొట్లు ఏర్పాటు చేసి.. వాటి సంరక్షణకు కృషి చేస్తోందని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా మండలానికి 9 నీటి తొట్లు మంజూరయ్యాయని తెలిపారు. కొండపేట గ్రామంలో నిర్మించే పశువుల తొట్టికి డ్వామా పీడీ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 714 పశువుల నీటి తొట్లు మంజూరయ్యాయని, ఒక్కోదాన్ని రూ.33వేలతో నిర్మిస్తాందన్నారు. ఈనెల 10లోగా పూర్తి చేయాలన్నారు. ఆ గ్రామంలో ఉన్న పశువులను బట్టి అవసరమైతే మరో తొట్టి కూడా అదనంగా మంజూరు చేస్తామని తెలిపారు. కాగా, ఈ ఏడాది 80 లక్షల పనిదినాలను ఉపాధి పథకంలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఒక్కో కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాలకు మాత్రం 150 రోజులు పనిదినాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లాపశు సంవర్ధకశాఖ సంయుక్త అధికారిని శారదమ్మ, ఏపీడీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఏపీవో శైలజ, ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు, పశువైద్యాధికారి ఎర్రపురెడ్డి, సర్పంచ్ తుంగచంద్రయాదవ్, టీడీపీ నేతలు కె.విజయభాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ ఘర్షణపై డీఎస్పీ ఆరా.. 11 మందిపై కేసు



భూవివాద పొలాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

బహ్మంగారిమఠం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని మద్దిరెడ్డిపల్లెలో సోమవారం దాయాదులైన ఇరువర్గాల వారు భూ సమస్యతో ఘర్షణకు దిగగా ఒకరు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మంగళవారం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ యాదవ్, ట్రైనీ డీఎస్పీ భవానీ వివాదాస్పద భూముల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఘర్షణకు దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఘర్షణ సందర్భంగా దహనమైన ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. అనంతరం మృతి చెందిన పెసల నారా యణరెడ్డి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి భూతగాదాకు కారణమైన పరిస్థి తులను విచారించారు. ఘర్షణకు సంబంధించి 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ విచారణలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి రాజకీయ సమాధి కడతాం

- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కడప మారుతీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్స రాలుగా ఎస్సీ వర్గీకరణ విషయంలో స్పష్టమైన వైఖరి వెల్లడించ కుండా... మాదిగల అభివృద్ధికి శకునిలా అడ్డుపడిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి రాజకీయ సమాధి కడతామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి డి.రామకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పటికీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో సైతం కనీసం ఒక్క న్యాయవాదిని కూడా నియమించకుండా మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజల భవిష్యత్‌ను నాశనం చేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ కోసం ముందు నుంచి సానుకూలంగా వున్నా రన్నారు. ఆ కోవలో ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమో దింపచేయడం పట్ల సంతో షం వ్యక్తం చేశారు. సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు మానికింది వెంక టేష్, ఎంఎస్‌పీ అధికార ప్రతినిధి మాతయ్య, నాయకులు శివయ్య, నరసిం హ, ఓబయ్య, భాస్కర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు

- భూమిని పరిశీలించిన ఆర్డీవో

సిద్దవటం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టక్కోలి గ్రామ రైతు తన పట్టా భూమిని ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంగళవారం కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ పరిశీలించారు. టక్కోలి గ్రామానికి చెందిన దుంపల అశోక్‌రెడ్డి సర్వేనంబరు 429/1, 429/2, 430లో తన పట్టా భూమి 4.80 ఎకరాల్లో అగ్రికల్చర్ గోడౌన్ నిర్మాణం కొరకు ల్యాండ్ కన్వర్షన్ కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కడప ఆర్డీవో రైతు పట్టా భూమి హద్దులు పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు మాధవీలత, ఆర్‌ఐ శ్రీనివాసులు, మండల సర్వేయర్ నాగభూషణంరెడ్డి, విలేజ్ సర్వేయర్ పవన్‌కుమార్, వీఆర్వో సంటయ్య పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ

సిద్దవటం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారి భాకరాపేట చాముండేశ్వరిపేట, పార్వతీపురం, మాధవరం-3, ఉప్పరపల్లె గ్రామాల్లో నేషనల్ హైవేకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదల్లో తనిఖీ చేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబునాయుడు దంపతులు, మంత్రులు, వీఐపీ అధికారుల పర్యటన ఉన్నందున ఎస్పీ ఆదేశాలతో ఆర్వోపీ సిబ్బంది, పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

మనస్థాపంతో యువతి ఆత్మహత్య



పోరుమామిళ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన కల్లూరి రామతులసి (25) అనే యువతి ఇంట్లో ఎవరూ లేని సమ యంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీ సుల వివరాల మేర కు.. మండలంలోని తిరువెంగలాపురం గ్రామానికి చెందిన కల్లూరు జయరామిరెడ్డి కుమార్తె తనకు సరైన పెళ్లి సంబంధం రావడం లేదని మనస్థాపం చెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుంది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. మంగళ వారం సాయంత్రం మృతదేహానికి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

పాత కలెక్టరేట్‌ను పరిశీలించిన కలెక్టర్



పాత కలెక్టరేట్ భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం బీసీ భవన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాత రిమ్స్ పాత కలెక్టరేట్‌లోని ప్రాంగణాల భవనాలను ఆయన కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ సంబంధిత అధికారులతో కలసి పరిశీలించా రు. ముందుగా పాత రిమ్స్‌లోని ఖాళీ స్థలాలను, నూతనంగా నిర్మి స్తున్న బీసీ వెల్ఫేర్ భవనాన్ని బీసీ సంక్షేమాధికాధికారితో కలిసి మీటింగ్ హాలు, తరగతి గదులు, ఇతర రూములను పరిశీలించారు. బీసీ వెల్ఫేర్ ఫండ్స్ మెయింటెన్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం పాత కలెక్టరేట్‌లోని ప్రాంగణాలను, గదులను పరిశీలించి అక్కడ పని చేసిన గత అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల వివరాలను అడిగి తెలు సుకున్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భరత్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీరేనా..?

- ఎర్రగుంట్లకు గండికోట తాగునీటి స్కీం
- రూ.109 కోట్లతో టీడీపీ హయాంలో మంజూరు
- ఆ స్కీంను గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- తాజాగా రూ.117 కోట్లతో రివైజ్డ్ డీపీఆర్ తయారీ



పనులు చేపట్టకపోవడంతో గతంలో వచ్చిన పైపులు మార్కెట్‌యార్డులో నిరుపయోగంగా ఉన్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యంతో ఎర్రగుంట్ల ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. ఎర్రగుంట్ల ప్రజల దాహార్తి తీర్చేందుకు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.109 కోట్లతో గండికోట నుంచి తాగునీటి స్కీం టెండర్లు పిలి చారు. రెండు ఫేజ్‌లుగా పనిని విభజించి కేటాయించారు. పనులు నిర్వహించేందుకు పైపులు కూడా సరఫరా చేశారు. అనంతరం అధికారం మారింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ పనులను పట్టించుకోలేదు. కేవలం కమీషన్లకు కక్కుర్తిపడి పనులను అడ్డుకున్నార న్న విమర్శలున్నాయి. దీంతో ఎర్రగుంట్ల వాసులకు ఇప్పటికీ తాగు నీటి సమస్య అలాగే ఉంది. దీంతో ఇక్కడి ప్రజల దాహార్తిని తీర్చేందుకు శాశ్వతమైన పరిష్కారం కోసం తాజాగా రూ.117 కోట్ల తో గండికోట నుంచి తాగునీటి స్కీంకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా

ఎర్రగుంట్లలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. సరఫరా అయ్యే నీటికి, వీధులకు వెళుతున్న వంతులకు పొంతనే లేదు. నిల్వ చేసేందుకు సరైనన్ని ట్యాంకులు ఇప్పటికీ లేవు. ఉన్నవాటిని మూలన పడేసి, నీటి సరఫరాను కొందరు ఇష్టారాజ్యంగా మార్చేశారు. కొన్ని వీధుల్లో ప్రతిరోజూ, రెండురోజులకో మారు, మరికొన్ని వీధుల్లో 4 రోజులకు, ఇంకొన్ని వీధుల్లో వారానికి, 10 రోజులకో మారు తాగునీరు వదులుతున్నారు. సుమారు 45 వేల జనాభా ఉన్న ఎర్రగుంట్లకు ప్రస్తుతం పెన్నా, కమలాపురం నీటి స్కీంలే దిక్కు. వర్షాలు రాకపోతే ఎండిపోతున్నాయి. దీంతో తీవ్ర సమస్యలొస్తున్నాయి. కోట్లు వెచ్చించి ట్యాంకులు నిర్మించినా, పైపు లైన్లు వేసినా తాగునీటి సమస్య తీరడం లేదు. బోర్లు ఆదుకుంటున్నా విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. గండికోట స్కీం వస్తే కోట్లలో విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయి. వాటిని ఇతర అభివృద్ధి పనులకు వాడుకోవచ్చు.

రూ.117 కోట్లతో రివైజ్డ్ ప్రతిపాదన

గతంలో రూ.109 కోట్లతో గండికోట నుంచి ఎర్రగుంట్లకు తాగునీటి స్కీం మంజూరైన సంగతి తెలిసిందే. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ పనులను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచన మేరకు ఇటీవల రూ.117.89 కోట్లతో ప్రభుత్వానికి రివైజ్డ్ డీపీఆర్ పంపారు. ఈ మేరకు 8 ఎంఎల్‌డీ సామర్థ్యంతో గండి కోట వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మిస్తారు. గండికోట నుంచి ఎర్రగుంట్ల వరకు 42 కి.మీ. మెయిన్ పైప్‌లైన్ నిర్మిస్తారు. గ్రావి టీతో నీరు సరఫరా అవుతుంది. అలాగే ఎర్రగుంట్లలో 2350 కిలోలీ టర్ల సామర్థ్యం గల మూడు ట్యాంకులు నిర్మిస్తారు.

జడ్పీ బాలుర హైస్కూల్‌లో 25 సెంట్లలో ఒక ట్యాంకు నిర్మించేందుకు గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. హిందూ శ్మశానవాటికలో ఒకటి, ప్రకాష్ నగర్‌లో మరొకటి నిర్మించేందుకు స్థలాలు ప్రతిపాదించారు. ఎర్రగుంట్లలోని 20 వార్డుల్లో 55 కి.మీ. డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ నిర్మిస్తారు. పాత కనెక్షన్స్‌కు ఉచితంగా కనెక్షన్లు ఇవ్వనుండగా కొత్తవాటికి నిబంధనల ప్రకారం కనెక్షన్లు ఇస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ స్కీం అమల్లోకొస్తే ఎర్రగుంట్లకు రోజూ తాగునీరు సరఫరా చేయవచ్చు. అయితే ఈసారైనా ఈ స్కీం పూర్తి చేసి తమ దాహార్తి తీర్చాలని ఎర్రగుంట్ల ప్రజలు కోరుతున్నారు.

డీపీఆర్ పంపాం

గండికోట నుంచి ఎర్రగుంట్లకు తాగునీటి పైప్‌లైన్‌కు సంబంధించి రివైజ్డ్ స్కీంలో రూ.117.89 కోట్లతో డీపీఆర్ పంపాము. అది మంజూరైతే మూడు నాలుగు నెలల్లో టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఎర్రగుంట్లకు మాత్రమే ఈ స్కీం వర్తిస్తుంది.

- మూర్తి, ఈఈ, పీహెచ్

పట్టా ఇప్పించండి సారూ...

● జేసీకి ఓ మహిళ వినతి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న బాధితురాలు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దాదాపు 35 ఏళ్ల క్రితం ఇచ్చిన తన స్థలానికి సంబంధించిన పట్టా పోగొట్టుకున్నానని, పట్టా పేపరు ఇప్పించాలని ఓ మహిళ జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం పుల్లమ్మ అనే మహిళ జేసీ కార్యాలయంలో కలిసి ఆవేదన చెందారు. సర్వే నెంబర్ 800/2ఏ2 విస్తీర్ణం 2.66 సెంట్ల పట్టాను ఇల్లు మారే క్రమంలో తాను ఎక్కడో పోగొట్టుకున్నానని, దానికి సంబంధించిన కాపీ వెతికించడానికి పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయం చుట్టూ దాదాపు మూడు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోలేదని వాపోయారు. స్పందించిన జేసీ సంబంధిత తహసీల్దార్‌కు ఫోన్ చేసి వెంటనే ఎస్.కొండమ్మ అనే పేరుకు సంబంధించిన పట్టా జిరాక్స్ కాపీ బాధితురాలికి ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గాలివీడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా పిల్లలు ఈత కొట్టడానికి బావులు, చెరువుల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామక్రిష్ణ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిపూట బడులు, పదవ తరగతి పరీక్షలు ముగిసిన క్రమంలో పిల్లలు ఎక్కువగా వేసవిలో చేపలు పట్టేందుకు, సేద తీరడానికి స్విమ్మింగ్ పూల్, చెరువులు, బావుల వద్దకు వెళుతుంటారని, అవి ఎంత లోతు ఉన్నాయో తెలియక అందులో రాళ్లు, బురద, తీగలు ఉండటంతో అందులో చిక్కుకుని ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. పెద్దలు, ఈత వచ్చిన వారి పర్యవేక్షణలోనే స్విమ్మింగ్ నేర్చుకోవాలన్నారు.

కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్ వితరణ



కుర్చీలు, ఫ్యాన్లు, వితరణ చేస్తున్న రంజిత్ రాయల్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రాయుడుకాలనీ అంగన్వాడీ కేంద్రానికి టీడీపీ నాయకులు రంజిత్‌రాయల్ రెండు ఫ్యాన్లు, కుర్చీలు, ప్లేట్లు వితరణ చేశారు. మంగళవారం రాయచోటి పట్టణ టీడీపీ నేత మడితాటి శ్రీనివాసులరెడ్డి జన్మదిన వేడుకలను రాయుడు కాలనీ టీడీపీ నాయకులు రంజిత్‌రాయల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాయుడుకాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల మధ్య అంగన్వాడీ కార్యకర్త మస్రూన్‌బీ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆసిన్‌లతో కలిసి కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఎండ తీవ్రతకు ఇబ్బంది పడుతున్న పిల్లలకు సీలింగ్ ఫ్యాన్‌తో పాటు కుర్చీలు, ప్లేట్లను అంగన్వాడీ కేంద్రానికి అందజేశారు.

కరవు మండలంగా ప్రకటించాలి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని రాష్ట్ర మాజీ డైరెక్టర్, మండల టీడీపీ సీనియర్ నాయకుడు కొమరా వెంకటనరసయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కడప జిల్లాలో 10 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించారని, అందులో ఒంటిమిట్ట మండలాన్ని చేర్చకపోవడంతో రైతాంగం తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఒంటిమిట్ట చెరువుకు నీరు నింపలేకపోవడంతో మండలంలో కరవు పరిస్థితులు వచ్చాయన్నారు. మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని ఆయన కోరారు.

39 నీటితొట్లు మంజూరు

రామాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో పశువులకు దాహార్తి తీర్చడానికి 39 నీటి తొట్లు మంజూరైనట్లు ఉపాధి హామీ ఏపీవో పెంచలయ్య తెలిపారు. మండలంలోని నీలకంఠ్రావుపేట, కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలోని కడవకూటివాండ్లపల్లె గ్రామంలో నీటి తొట్లను ఈసీ శివయ్యతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మంజూరైన నీటి తొట్లను ఈ నెల 1న పనులు ప్రారంభించి 10వ తేదీలోపు నిర్మాణం పూర్తి చేయాలని డ్వామా పీడీ ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత వేసవి సీజన్‌లో పశువుల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా, తిమ్మారెడ్డి, చిట్టి రెడ్డెయ్య, ధనుంజయ, నారాజు, నరసహరి, సుబ్బరాయుడు, ధర్మయ్య, టెక్నికల్ అసిస్టెంట్ పెంచల్‌రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బడి లేదు.. గుడి లేదు...

అంగన్వాడీ కేంద్రం అసలే లేదు

● ఓట్ల కోసం తప్ప.. పథకాలకు పనికిరామా ?

● ఇదీ యానాది కాలనీ వాసుల దుస్థితి



కల్పనాయునిచెరువు గ్రామంలోని యానాదికాలనీ



విద్యకు దూరంగా యానాదికాలనీలోని పిల్లలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వారు ఓట్ల కోసమే.. పథకాలకు పనికి రారు... ఆ గ్రామంలో బడి లేదు. గుడి లేదు. అంగన్వాడీ కేంద్రం అసలే లేదు. ఆ గ్రామంలోని పిల్లలు చదువు కోసం పాఠశాలకు వెళ్లాలంటే ఐదు కి.మీ. నడవాల్సిందే. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా నేటికీ ఆ గిరిజనుల జీవితాల్లో వెలుగులు కనిపించడం లేదు. గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామంటూ ప్రభుత్వాలు పత్రికా ప్రకటనలకే పరిమితం అవుతున్నాయే తప్ప వారికి పథకాలు అందించడంలో శ్రద్ధ చూపడం లేదనే విషయం ఆ యానాది కాలనీ ప్రజలను చూస్తే మనకు అర్థమవుతోంది. వివరాల్లోకి వెళితే...

జిల్లా కేంద్రమైన రాయచోటి నియోజకవర్గ పరిధిలోని రామాపురం మండలం కల్పనాయునిచెరువు గ్రామం యానాది కాలనీలో సుమారు 40 కుటుంబాలకు పైగా యానాదులు నివసిస్తున్నారు. వీరంతా ప్రతినిత్యం కూలి పనులు చేసుకుంటూ, గొర్లను మేపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. గ్రామంలో సుమారు 40 మందికి పైగా పిల్లలు ఉన్నప్పటికీ అందులో కొంతమంది పిల్లలు గ్రామానికి సమీపంలోని మూలపల్లెలో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే అడ్డదారిలో మూడు కి.మీ., రోడ్డు వెంబడి ఐదు కి.మీ. నడక తప్పడం లేదు. ఆ కాలనీల్లో చిన్న పిల్లలు సుమారు 20 మందికి పైగా ఉన్నప్పటికీ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం గానీ, ప్రభుత్వ పాఠశాల గానీ లేకపోవడంతో చిన్నపిల్లలంతా పక్క గ్రామానికి వెళ్లి రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

వెంటాడుతున్న రోడ్డు, నీటి సమస్య

సుమారు 40 కుటుంబాలు గల యానాది కాలనీలోని ప్రజలు సమీపంలోని మూలపల్లెకు వెళ్లాలన్నా అడ్డదారిలో పొలాల వెంబడి కాలిబాట మాత్రమే ఉండడం వలన పంటలు సాగు చేసిన సమయంలో ఇబ్బందికరంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేగాక గ్రామంలో ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన మంచినీటి పథకం బోరు నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో వచ్చే అరకొర నీటితో అవస్థలు పడుతున్నామని అంటున్నారు. అంతేగాక గ్రామంలో అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో 20 మందికి పైగా ఉన్న చిన్నపిల్లలు, గర్భవతులు, బాలింతలు మూడు కి.మీ. దూరంలో ఉన్న మూలపల్లికి వెళ్లి ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి మౌలిక సౌకర్యాలు కల్పించాలని గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయండి

- రమణమ్మ, యానాదికాలనీ, కల్పనాయునిచెరువు



మా కాలనీలో 40 మందికి పైగా పిల్లలు ఉన్నారు. గ్రామంలో ఇంత వరకు ప్రభుత్వ పాఠశాల గానీ, అంగన్వాడీ కేంద్రం గానీ లేదు. ప్రతిరోజు పిల్లలు 5 కి.మీ. కాలినడకన వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో సుమారు 20 మందికి పైగా చిన్నపిల్లలంతా పక్క గ్రామంలోని మూలపల్లెకు మూడు కి.మీ. కాలినడకన వెళ్లి వస్తున్నారు.

ఓట్ల కోసమే మమ్మల్ని వాడుకుంటున్నారు

- సుధాకర్, యానాదికాలనీ, కల్పనాయునిచెరువు



ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మమ్మల్ని వాడుకుంటున్నారు. ఎన్నికలు ముగిశాక మాకు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను పలుమార్లు అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. మాకు ఎటువంటి పథకాలు రావడం లేదు. గ్రామంలో తాగునీటి, రోడ్డు సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం.

మౌలిక వసతులు కల్పించండి

- రెడ్డెయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు



యానాదికాలనీలో ప్రభుత్వ అధికారులు మౌలిక వసతులను కల్పించాలి. గ్రామంలో 40 మందికి పైగా గిరిజన పిల్లలు ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాల గానీ, అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో చిన్నపిల్లలంతా పక్క గ్రామానికి కాలినడకన వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు గ్రామంలో తాగునీటి సమస్య, రోడ్డు సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్‌కుమార్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డెప్పగారి రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేసిన ప్రభుత్వం 2024-25 సంవత్సర కాలంలో టీడీపీ చేయాలనుకున్న రెడ్‌బుక్ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. గడిచిన పది నెలల్లో ప్రభుత్వం కేవలం జగన్‌పై నిందలు వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా, హామీలు నెరవేర్చకుండా కాలం గడిపేసిందని ఆరోపించారు. పది నెలలు వెయిట్ చేశామని, ఇక చూస్తూ ఊరుకోమన్నారు. ప్రజల పక్షాన పోరాడుతామని, వెనక్కు తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కొలిమి హరూన్‌బాషా, ఎస్‌కే హుస్సేన్, సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి'

రాజంపేటటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆప్కాస్ విధానం రద్దు చేసి మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, నాయకులు ఓబయ్య, ప్రసాద్, రమణ, ప్రమీల, బాలాజీ, శ్రీను, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం కోటలో ఖుద్బా వేడుకలు

సిద్దవటం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం కోటలో మంగళవారం బాసి ఖుద్బా వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం రంజాన్ వేడుకలు జరుగ్గా జిల్లా వ్యాప్తంగా ముస్లింలు మరుసటిరోజున బాసి ఖుద్బా వేడుకలను జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అన్న పానీయాలను వెంట తెచ్చుకుని సంతోషంగా గడిపారు. సాయంత్రం వారి గమ్యాలకు చేరుకున్నారు.

రెండు వేర్వేరు దుకాణాల్లో చోరీ

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు వేర్వేరు దుకాణాల్లో చోరీ జరిగి నగదు, వస్తువులు అపహరించుకుపోయారు. చౌటపల్లి పంచాయతీ రవీంద్రనగర్‌లో ఓ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు దుకాణంలోని రేకులు తొలగించి రూ.45 వేల సిగరేట్ ప్యాకెట్లు, కూల్‌డ్రింక్స్, విలువైన వస్తువులతో పాటు, రూ.5 వేల నగదు అపహరించుకుపోయినట్లు బాధితుడు పవన్‌కుమార్ తెలిపారు. అలాగే దక్కన్ టీ స్టాల్‌లో సిగరేట్ ప్యాకెట్లు, కూల్‌డ్రింక్స్, రూ.40 వేల వస్తువులను చోరీ చేసినట్లు యజమాని ఇర్షాద్ తెలిపారు. పై చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు విచారిస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పెనగలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మంగళవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టారు. అనంతంపల్లెలో నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. అలాగే మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. అనంతరం వృద్ధులు, వికలాంగులకు పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాపాటివారిపల్లెలో పశువులు తాగడానికి తొట్టికి భూమిపూజ చేశారు. అలాగే కాకర్లవారిపల్లెలో కూడా ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం పెనగలూరు మండలం ఓబిలి, నందలూరు మండలం టంగుటూరు మధ్యన చెయ్యేరు నదిపై నిర్మించతలపెట్టిన హైలెవల్ వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.విజయరావు, ఏపీవో ఉమా మహేశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సునీత, పీఆర్ ఏఈ గంగులయ్య, ఏవో సుబ్రమణ్యం, ఏఎస్ఐలు రాముడు, మల్లికార్జున, వరప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంటు విజేతలుగా రాజంపేట వాసులు

నందలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వేకేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘం కార్యాలయంలో స్మాషర్స్ షటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కడప జిల్లా స్థాయి డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రాజంపేటకు చెందిన వర్మ, శంకర్‌లు విజేతలుగా నిలిచారు. వీరికి రూ.7 వేల నగదుతో పాటు రెండు షీల్డులను విశ్రాంత మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బచ్చు జయభాస్కర్‌రావు చేతులమీదుగా అందించారు. అదేవిధంగా నందలూరుకు చెందిన మస్తాన్, ముంగి మోహన్‌లు రన్నర్స్‌గా నిలిచి రూ.5 వేల నగదుతో పాటు షీల్డులను గెలుచుకున్నారు. కడపకు చెందిన మహేష్, తేజలు తృతీయ స్థానంలో నిలిచి 3 వేలు నగదు, షీల్డు, నందలూరుకు చెందిన పీఈకే మూర్తి, బుల్లెట్ హరిలు నాలుగో స్థానంలో నిలిచి రూ.2 వేల నగదు, షీల్డులను, టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్, రైల్వే ఆఫీసు సూపరింటెండెంట్ రవిశంకర్, ప్రభుత్వ వైద్యులు హీరాసింగ్, ఆర్గనైజర్లు అఖిల్, దినేష్, అభినయ్, హర్ష, రాము, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్ని ఇబ్బందులున్నా పింఛన్లు ఆగవు : వికాస్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదల పింఛన్లు ఆగవని టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో మంగళవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మాదిరిగా కాకుండా తమ ప్రభుత్వం ప్రజలకు చెప్పిన విధంగా కట్టుబడి ఉండి ప్రజలకు నెల మొదటి రోజునే ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు నార్జాల హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పండుటాకులకు భరోసా : ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పండుటాకులకు, వితంతువులకు, వికలాంగులకు కొండంత భరోసానిస్తున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు ఖాదర్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని మార్కెట్ వీధిలో వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ

చిన్నమండెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలోని కదిరివాండ్లపల్లె, వండాడి గ్రామంలోని ఒక్కొక్కటి రూ.33 వేలతో నిర్మిస్తున్న రెండు నీటి తొట్లను పీడీ వెంకటరత్నం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కరువును దృష్టిలో ఉంచుకొని మూగజీవాలు నీటితో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదని దృఢ సంకల్పంతో ఈ నీటి తొట్ల నిర్మాణాన్ని చేపడుతుందని, రైతులు ఈ నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లోని మంచినీటి పథకం బోర్లు ఎండిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దప్పేపల్లె గ్రామ పరిధిలో కొండావాండ్లపల్లె, విజయనగరం గ్రామాల్లో దాదాపు నెల రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, రఫీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థి అదృశ్యం

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుళారం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని పబ్లిక్ పరీక్ష రాసి కనిపించలేదని బాలిక తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

నూతన భవనంలోకి ఏపీజీబీ శాఖ

రాజంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతీయులకు, పేద ప్రజలకు అందుబాటులో రాజంపేట ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఏపీజీబీ మెయిన్ బ్రాంచ్‌ను మన్నూరు పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న నూతన భవనంలోకి మార్పు చేస్తున్నట్లు సీనియర్ మేనేజర్ కె.రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప హెడ్ ఆఫీసు నుంచి జనరల్ మేనేజర్ ఆర్.గిరి, ప్రాంతీయ కార్యాలయం నుంచి రీజనల్ మేనేజర్ సుషాంత్‌కుమార్ స్వారోలు హాజరై ప్రారంభిస్తారన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

● వైద్యాధికారి డాక్టర్ శివకుమార్

సిద్దవటం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ హెల్త్ నర్సు జయసార కాంతామణి మార్చి 31న పదవీ విరమణ చేశారు. మంగళవారం పీహెచ్‌సీలో సన్మానసభ ఏర్పాటు చేసి ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు మురళి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ రమణ, జ్యోతి, మహబూబ్‌బాషా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

నందలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు యెద్దల విజయసాగర్ పేర్కొన్నారు. మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పశువుల నీటితొట్టికి పూజలు చేసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధాకృష్ణంరాజు, టీడీపీ నాయకులు రాము, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకట్రామరాజు



రైల్వేకోడూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అద్దెపల్లె వెంకట్రామరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కార్యదర్శి ఎం.శివశంకర్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను గత రెండు రోజుల క్రితం బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించారని, ఈ ఎన్నికల్లో వెంకట్రామరాజును అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కోశాధికారిగా ఎన్.ఇందిరమ్మ, జాయింట్ కార్యదర్శులుగా బీవీ రమణయ్య, డీసీఎల్ విజయలక్ష్మీలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన వివరించారు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ఠ

సుండుపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీలోని కొలిమిట్ట హరిజనవాడ సమీపంలో వెలిసిన శ్రీమాతమ్మ తల్లి ఆలయంలో గురువారం ధ్వజస్థంభ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మండల నలుమూలల నుండి భక్తులు హాజరుకావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

5 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

పెనగలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనగలూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఈ నెల 5 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ మండల స్థాయి పోటీలు జరుగుతాయని నిర్వాహకులు ఎస్.జనార్దన్, కె.శంకరయ్యలు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విన్నర్ జట్టుకు జనసేన పార్టీ కువైట్ అధ్యక్షుడు హరిబాబురాయల్, రన్నర్ జట్టుకు పెనగలూరు జేఏసీ నాయకుడు టి.రాజేష్ నగదు బహుమతిని అందజేస్తారని తెలిపారు. ఈ నెల 3 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వైద్యసేవలు వినియోగించుకోవాలి

● డాక్టర్ దేవేందర్‌రెడ్డి

ఓబలవారిపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నరాజుపోడు గ్రామ పంచాయతీలో 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందించినట్లు వైకోట పీహెచ్‌సీ డాక్టర్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధులు, పసిపిల్లలు సురక్షిత ప్రాంతాల్లో ఉండి వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు నెల వారి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక లోగిలి.. కోదండరాముని సన్నిధి..

(5వ పేజీ తరువాయి)

రాక్షసుల బెడద ఎక్కువగా ఉండటంతో యజ్ఞయాగాదులు నిర్వహించలేకపోయారు. మహాముని కోరికపై శ్రీరామలక్ష్మణులు రాక్షస సంహారం చేసిన అనంతరం మునుల యజ్ఞయాగాదులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఒకే శిలలో నిర్మితమైన సీతారామలక్ష్మణ విగ్రహాలను మునులకు ప్రదానం చేశారట. ఈ విగ్రహాలు మూడు విడివిడిగా కనిపించినా ఇవన్నీ ఒకే శిలపై ఆవిర్భవించి ఉన్నందున ఒంటిమిట్టకు ఏక శిలా నగరం అని పేరు వచ్చింది. అరణ్యవాసంలో భాగంగా శ్రీరాముడు అమ్ములపొది, పిడిబాకు, కోదండం చేతపట్టి రావడంతో కోదండరాముడు అనే నామం వచ్చింది.



ఒంటిమిట్ట కోదండరామాలయంలోని అపురూప శిల్పకళాసంపద

ఓ మధురానుభూతి...

కోదండరాముడి ఆలయాన్ని సందర్శించడం ప్రతి ఒక్కరికీ మధురానుభూతిని కలిగిస్తుండి. ఇక్కడి కోదండరామాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఒక అద్భుత దృశ్యం గోచరమవుతుంది. ఒక ఎత్తయిన పీఠంపై ఉన్న ఆలయం.. చుట్టూ చిన్న, పెద్ద గుట్టలు కనిపిస్తాయి. ఆ గుట్టలన్నీ పుష్పరేకులు గానూ.. మధ్యలో ఉన్న దేవాలయం కర్ణికగా అమరి ఉండటం ప్రత్యేకత. ఎంతో చారిత్రక, మరెంతో ప్రాధాన్యం కలిగిన ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని సందర్శించడం మధురానుభూతిని కలిగిస్తుంది. కోదండరాముడి సేవలో ఎందరో మహానుభావులు తరించేవారని చరిత్ర చెబుతోంది.

సాహితీ ఉద్ధండుడు బమ్మెర పోతనామాత్యుడు, తిప్పయ్య, అయ్యలరాజు రామభద్రుడు, తిప్పకవి, మాల ఓబన్న, ఆంధ్రా వాల్మీకి వావిలకొలను సుబ్బారావు, నల్లకాల్వ అయ్యప్ప, ఉప్పుగొండూరు వెంకటకవి, తాళ్లపాక అన్నమాచార్య, పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వంటి కవులు, భక్తులు, మహనీయులు ఎందరో రామయ్య సేవలో తరించిన వారే. మహాభాగవతాన్ని తనకు అంకితమివ్వమని పోతనను శ్రీరాముడు కోరినది ఇక్కడేనని ప్రతీతి.

ఇమాంబేగ్ పిలుపు.. రామయ్య పలుకు...

క్రీ.శ.1640 ప్రాంతంలో కడపను పాలించిన అబ్దుల్ నబీఖాన్ ప్రతినిధి ఇమాంబేగ్ ఒంటిమిట్ట కోదండరాముడి మహిమను పరీక్షించేందుకు వచ్చాడట. గుడి లోపలికి వెళ్లి ఓ రామా..! ఒంటిమిట్ట రఘురామ..! అని మూడుమార్లు పిలువగా గుడి లోంచి ఓ.ఓ.ఓ.. అనే సమాధానం వినపడింది. దాంతో ఇమాంబేగ్ ఆనందంతో మోకరిల్లి రాముడి భక్తునిగా మారాడు. శ్రీరాముని కైంకర్యం కోసం ఒక బావిని కూడా తవ్వించారు. ఆలయం వద్ద ఆ బావిని నేటికీ చూడవచ్చు. అందువల్లే ప్రతి శుక్రవారం ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె దర్గాకు వెళ్లే ముస్లింలు తిరిగి వస్తూ కోదండరాముడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించడం విశేషంగా చెప్పుకోవచ్చు.

అపురూప శిల్పసంపద

ఒంటిమిట్ట కోదండరామాలయంలోని అపురూప శిల్పసంపద భక్తులను మైమరపిస్తుంది. రంగమండపంలోని 32 శిలా స్తంభాల్లో మూడు ముఖాలు కలిగిన అపురూప శిల్పాలు రామాయణ, భాగవతార్‌లను, నాటి పాలకుల రసజ్ఞతలను ప్రదర్శిస్తున్నాయి.

జాంబవంత ప్రతిష్ఠ

త్రేతాయుగంలో ఒంటిమిట్ట ప్రాంతానికి వచ్చిన జాంబవంతుడు ఒకనాటి రాత్రి విశ్రమించగా స్వప్నంలో సీతారామలక్ష్మణులు దర్శనమిచ్చారట. జాంబవంతుడు ఉదయమే లేచి పరిసరాల్లో వెతకగా ఒక గుబురు పొదల్లో సీతారామ లక్ష్మణ విగ్రహాలు కనిపించాయి. దాంతో జాంబవంతుడు ఆనందభరితుడై మంత్రోచ్చారణలతో సీతారామలక్ష్మణ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అందువల్లే జాంబవంత ప్రతిష్ఠ అని పేరు వచ్చింది.

రామ లక్ష్మణ బాణాలకు వెలసిన తీర్థాలు

అరణ్యవాసంలో భాగంగా పర్యటించిన సీతారామలక్ష్మణులు అలసి ఒక చెట్టునీడన చేరారు. ఆ సమయంలో సీతాదేవికి దాహంగా ఉండటంతో శ్రీరాముడు బాణాన్ని భూమిలోకి సంధించగా పాతాళం నుంచి గంగ పెల్లుబికింది. దీంతో ముగ్గురు దాహం తీర్చుకున్నారు. అదే సమయంలో లక్ష్మణుడు కూడా భూమిలోకి బాణం సంధించగా గంగ ఉద్భవించింది. అప్పటి నుంచి ఇవి శ్రీరామలక్ష్మణ తీర్థాలుగా ప్రసిద్ధి చెందాయి.



చంద్రబాబు నిలిపిన ప్రాణానికి

నారా లోకేశ్ అండ

● చిన్నారి జ్ఞానసాయికి పింఛను మంజూరు ● చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చిన్నారికి పింఛను పంపిణీ చేస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలిపిన ప్రాణానికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. 2016లో కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి జ్ఞానసాయి ప్రాణాలు కాపాడేందుకు అప్పట్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చూపిన చొరవ ఇప్పటికీ అందరికీ గుర్తుండిపోయింది. నిస్సహాయ స్థితిలో జన్మనిచ్చిన తల్లిదండ్రులే బిడ్డను చంపుకునేందుకు సిద్ధమైన సమయంలో చంద్రబాబు ప్రభుత్వ సాయంతో వైద్య, శస్త్ర చికిత్స అందించి ఆ ఇంటి దీపం ఆరిపోకుండా చేశారు. ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ ఆర్ఎస్ కొత్తపల్లెకు చెందిన జల్లా రమణప్ప, సరస్వతి దంపతులు తమకున్న రెండు ఎకరాల్లో పూల సాగు చేస్తూ జీవనం సాగించేవారు. వీరి మొదటి సంతానం జ్ఞానసాయికి పుట్టుకతోనే కాలేయ వ్యాధి సోకింది. మదనపల్లె, తిరుపతి, బెంగళూరులోని పలు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించారు. బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో ఎనిమిది నెలల వయస్సులో రూ.5 లక్షలు ఖర్చు చేసి శస్త్ర చికిత్స చేయించగా అది వికటించింది. దీంతో పాపను బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా కాలేయ మార్పిడి చేయాలని, దీనికి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అంత డబ్బు ఖర్చు చేసి బిడ్డను బతికించుకోలేమని మెర్సీ కిల్లింగ్ (కారుణ్య మరణానికి) అనుమతి కోరుతూ తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించిన ఈ హృదయ విదారకర సంఘటన 2016 సంవత్సరం జూన్ నెలలో రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పాప ఆరోగ్య పరిస్థితిపై చలించిపోయారు. తక్షణం స్పందించి శస్త్ర చికిత్సకు అయ్యే ఖర్చు పూర్తిగా భరిస్తామని ప్రకటించి చిన్నారికి చెన్నైలోని గ్లోబల్ ఆస్పత్రిలో ప్రపంచ ప్రఖ్యాత వైద్య నిపుణుడు మహ్మద్ రేలా శస్త్ర చికిత్స చేశారు. తండ్రి రమణప్ప కాలేయాన్ని తీసి చిన్నారికి అమర్చారు. పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో చేయించిన ఈ శస్త్ర చికిత్స విజయవంతమై పాప కోలుకుంది. శస్త్ర చికిత్స, వైద్య పరీక్షల కోసం అప్పట్లో రూ.35 లక్షల వరకు ఖర్చయింది అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిన్నారికి పింఛను మంజూరు చేసి తండ్రికి తంబళ్లపల్లెలోని ఎస్టీ హాస్టల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించి అండగా నిలిచారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2022లో జ్ఞానసాయి పింఛను తొలగించింది. పాప పరిస్థితి చూసి పింఛను మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. ఈ క్రమంలో 2023 మార్చి నెలలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగిన యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌ను జ్ఞానసాయి కుటుంబం కలిసి విషయాన్ని వివరించింది. పాపకు ప్రతి నెలా మందులకు రూ.20 వేలు ఖర్చు అవుతుందని, పింఛను పునరుద్ధరిస్తే ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని జ్ఞానసాయికి కచ్చితంగా పింఛను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి విషయాన్ని ఇటీవల మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సూచనలతో ప్రభుత్వం జ్ఞానసాయికి ఏప్రిల్ నుంచి రూ.10 వేలు చొప్పున ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛను మంజూరు చేసింది. దీంతో మంగళవారం జయచంద్రారెడ్డి ఆ బాలికకు పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారి జ్ఞానసాయి, కుటుంబీకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ములకలచెరువులోని శారదా విద్యామందిర్‌లో బాలికకు సీటు ఇప్పించి ఉచితంగా విద్య అందిస్తానని ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ప్రకటించారు. పాఠశాల కరస్పాండెంట్ సనత్‌కుమార్‌తో మాట్లాడి అడ్మిషన్ ఇప్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త నీడు మల్లికార్జుననాయుడు, ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నేతలు మూగి రవిచంద్ర, ఆంజనేయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలాజీ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి వాల్మీకిపురంలో జరిగింది. పట్టణానికి సమీపంలోని ఓ కాలనీకి చెందిన బాలికపై జేసీబీ డ్రైవర్‌గా పనిచేసే అశోక్ అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



రామసముద్రం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించడం లేదని మండలంలోని అరికెల పంచాయతీ నాగపల్లెకు చెందిన గణేశ్ మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మార్చి 31న తన భార్య మౌనిక (20) ఇంటి నుంచి వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొనడంతో, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. కోటకొండకు చెందిన వెంకటరమణ కుమారుడు వంశీకుమార్ సంగం పాల డెయిరీలో పనిచేస్తాడు. పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా బెస్తపల్లె సర్కిల్ వద్ద బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో వంశీకుమార్‌కు, బొలెరో డ్రైవర్ ఖాజాపీర్ గాయపడ్డారు. వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సిలిండర్ లారీ బోల్తా : తప్పిన ప్రమాదం



బోల్తా పడ్డ సిలిండర్ల లారీ

సంబేపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని సంబేపల్లె టౌన్ వడ్లపల్లి క్రాస్ వద్ద మంగళవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ లోడ్‌తో కడప నుంచి నిమ్మనపల్లికి వెళుతున్న లారీ సంబేపల్లె వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఎటువంటి మంటలు వ్యాపించకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సిలిండర్లను మరొక లారీలోకి బదిలీ చేయించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో ఒకవైపు వాహనాలు వెళ్లేలా పోలీసులు దగ్గరుండి చర్యలు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు... పట్టణంలోని ఆరాధ్య ఆస్పత్రికి సమీపంలోని ప్రధాన దారి పక్కనే నివాసం ఉంటున్న పెనుబాల వెంకటరమణ (47) అనే వ్యక్తి బార్బర్ షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా భార్య, బిడ్డలతో దూరంగా ఉంటున్నాడని బంధువులు తెలిపారు. ఆదివారం రాత్రి మద్యం తాగి మిద్దెపై నిద్రించాడు. మిద్దెకు అవతలి వైపు గోడ లేని కారణంగా దొర్లుకుని కిందపడడంతో మృతి చెంది ఉంటాడని బంధువులు అంటున్నారు. మృతుడికి భార్య చాముండేశ్వరి, కుమారులు గోపీచంద్, దినేష్‌కార్తీక్‌లు ఉన్నారు. వెంకటరమణ మద్యం తాగి మిద్దెపైనుంచి ప్రమాదవశాత్తు పడ్డాడా? లేక ఎవరైనా తోసి ఉంటారా? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంఘిక సంక్షేమ అధికారి డిప్యుటేషన్ పొడిగింపు

కలికిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా షెడ్యూల్డ్ క్యాస్ట్ సర్వీసు కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీఎస్సీఎస్సీఎస్) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డెప్యుటేషన్‌లో ఉన్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి (డీఎస్‌డబ్ల్యూఓ) ఆర్.రవీంద్రనాథరెడ్డి డెప్యుటేషన్ గడువును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మార్చి 22 నుంచి 2026 జూన్ 30 వరకూ వర్తించే విధంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు ప్రభుత్వం పంచ ప్రాధాన్యాల లక్ష్యాన్ని నిర్దేశించిందని ఈ మేరకు వివిధ అభివృద్ధి పథకాలను చేపడుతున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా నిర్దేశించిన పంచ ప్రాధాన్యాలలో భాగంగా పశువుల నీటితొట్టెలు, ఫారంపాండ్ల నిర్మాణం, పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత, ఉపాధి కూలీలకు సగటు వేతనం రోజుకు కనీసం రూ.290 ఉండేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు 2025-26 మొదటి త్రైమాసికానికి రూ.266 కోట్ల లక్ష్యంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు. ఇందులో రూ.85.52 కోట్ల అంచనాతో 11 వేల ఫారంపాండ్ల నిర్మాణం, రూ.21.71 కోట్ల అంచనాతో పంట కాలువల్లో పూడికతీత, రూ.3.47 కోట్ల అంచనాతో 1034 పశువుల నీటి తొట్టెల నిర్మాణం, రూ.5.56 కోట్ల ఖర్చుతో సాగునీటి చెరువుల్లో పూడిక తీయడం, రూ.150.43 కోట్ల అంచనాతో వేతన జీవులకు 49 లక్షల పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా కృషి చేస్తామని తెలిపారు.

జిల్లాలో నీటి ఎద్దడి నివారించడానికి రూ.7.95 కోట్లతో ప్రణాళికను ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 116 గ్రామాల్లో నీటి సరఫరా జరుగుతోందన్నారు. వేసవి దృష్ట్యా రాబోయే కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో రూ.243.74 కోట్ల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటరత్నం, పంచాయతీరాజ్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రైల్వేకోడూరు ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట వడ్డిపల్లెకు చెందిన చామల సుబ్బరాయుడు (47) గత నెల 23న తలకు పూసుకునే రంగు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. అనంతరాజుపేట వడ్డిపల్లెకు చెందిన సుబ్బరాయుడు భార్యకు దూరంగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తలకు పూసుకునే రంగు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగి మృతికి పరిహారం

కలికిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల వర్క్‌షాపులో కాంట్రాక్టు అటెండరుగా ఉద్యోగం చేస్తూ ఆకస్మికంగా మృతి చెందిన వై.ఉమా మల్లికార్జున దేవరాయలుకు పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 అక్టోబరు 14న విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందాడు. అధికారులు నిర్దీత వ్యవధిలో ప్రభుత్వానికి సమాచారం సమర్పించడంతో మృతుడి భార్య వై.నాగమ్మకు ప్రభుత్వం రూ.2 లక్షలు నిధులు విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థిక శాఖ కూడా దీనికి ఆమోదం తెలిపింది. ఈ మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

కూటమి జెండా పైపు ధ్వంసం

● జెండాలు కాల్చివేత

● పోలీసులకు ఫిర్యాదు చేసిన నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ ఎగువ సుగాలి తాండాలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు కూటమి జెండా ఉన్న పైపును ధ్వంసం చేసి, జెండాలను కాల్చివేశారు. స్థానిక నాయకులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 30న బీజేపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేంద్రనాయక్, కూటమి నాయకులతో కలసి జెండా దిమ్మె ఏర్పాటు చేసి కూటమి జెండాలను ఆవిష్కరించారు. మరుసటి రోజు సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జెండా దిమ్మెకు ఉన్న పైపును ధ్వంసం చేసి జెండాలను కాల్చివేశారు.

మంగళవారం ఉదయం మండల టీడీపీ, బీజేపీ అధ్యక్షులు రెడ్డెప్పరెడ్డి, వెంకటరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించి నిరసన తెలిపి సంఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లోకేశ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి కాలా నారాయణ, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, గురుమూర్తి, బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివానాయక్, వెంకటేష్ నాయక్, వీరభద్రనాయక్, కోన భాస్కర్, వైవీ రమణారెడ్డి, డాన్స్ రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఐదేళ్ల జైలుశిక్ష



జైలుశిక్ష పడ్డ నిందితుడు సత్యమోహన్

రామాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముద్దాయి సత్యమోహన్‌కు ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహామూర్తి మంగళవారం తీర్పునిచ్చారని రాయచోటి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17-5-2019వ తేదీ రామాపురం మండలం పత్తి కనుమ రస్తా, సరస్వతిపల్లి బీట్, వంగిమళ్ల సెక్షన్, రాయచోటి రేంజ్‌లో ఒక సుమోలో నాలుగు ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న డ్రైవర్ సత్యమోహన్‌ను అరెస్టు చేసి కేసు కోర్టులో హాజరు పరిచి రాయచోటి సబ్‌జైలుకు తరలించారన్నారు. మంగళవారం జరిగిన తీర్పులో ముద్దాయికి శిక్ష పడటంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారని ఫారెస్టు తెలిపారు.

మిడిమానుకొండకు నిప్పు



మంటలు ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది, రైతులు

గుర్రంకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల ఆగడాలకు కొండలు, గుట్టలు కాలిబూడిదవుతున్నాయి. గుర్రంకొండ పట్టణంలోని ఇందిరమ్మకాలనీ సమీపంలో మిడిమానుకొండ ఉంది. ఈ కొండకు సోమవారం రాత్రి ఆకతాయిలు నిప్పంటించారు. దీంతో కొండ మొత్తం కాలిపోయి కొండ కిందున్న పొలాల్లోకి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో రైతులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించిన సాధ్యం కాలేదు. దీంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు పొలాల్లోకి వ్యాపించకుండా అదుపు చేశారు. అప్పటికే కొంత మంది రైతుల పొలాల్లో మామిడి, అల్లనేరుడు చెట్లు దెబ్బతినట్లు రైతులు వాపోతున్నారు.

రాయచోటిలో గ్యాంగ్ వార్

● రెండు వర్గాల మధ్య ఘర్షణ

● 9 మందిపై కేసు నమోదు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో గత కొంత కాలంగా గ్యాంగ్ వార్ నడుస్తోంది. ఈ క్రమంలోనే పాత కక్ష్యలను మనసులో పెట్టుకుని సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో రెండు గ్యాంగ్‌లు రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ చెక్‌పోస్టు సమీపంలో జాతీయ రహదారిపై హల్‌చల్ చేశాయి. కత్తులు, కట్టెలతో ఘర్షణకు దిగడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై రాయచోటి అర్బన్ పోలీసులు 9 మందిపై 307, 324 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ప్రాంతానికి చెందిన దేశ్‌ముఖ్ రియాన్, దేశ్‌ముఖ్ ఇస్రాన్ అన్నదమ్ముల గ్యాంగ్‌కు, అదే ప్రాంతానికి చెందిన నిస్సార్ అలియాస్ డాకు మహరాజ్, చాను, నూర్ గౌస్‌ల మధ్య పాత కక్షలు ఉండేవి. ఈ క్రమంలో ముందుగా సోమవారం రాత్రి దేశ్‌ముఖ్ రియాన్, దేశ్‌ముఖ్ ఇస్రాన్, అహ్మద్ తదితరులు కలిసి చాను, నూర్‌లపై దాడి చేశారు. దీంతో వారిరువురూ కలిసి జరిగిన విషయాన్ని తమ గ్యాంగ్‌కు సంబంధించిన ఎస్ఆర్ అలియాస్ డాకు మహరాజుకు సమాచారం ఇవ్వడంతో వారు తమ గ్యాంగ్‌తో కలిసి 30 మందికిపైగా రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీకి చేరుకొని అక్కడున్న ఇమ్రాన్, రియాన్ అహ్మద్‌లపై కత్తులు, కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అయితే ఎస్ఎన్ కాలనీలో రెండు గ్యాంగ్‌ల మధ్య పెద్ద ఎత్తున గొడవ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో దాడికి పాల్పడ్డ వారు వాహనాల్లో పరారయ్యారు. ఈ క్రమంలో నిస్సార్ అలియాస్ డాకు మహరాజ్ మరికొంత మంది కలిసి ఇన్నోవా కారులో కడప వైపు వెళుతూ రింగు రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీల్లో ఉన్న పోలీసు వాహనాన్ని ఢీకొని పరారయ్యారు. గతంలో వీరంతా ఒక పట్టణ టీడీపీ నాయకుడి వద్ద ఉండేవారని సమాచారం. గతంలో జరిగిన గొడవల్లో పోలీసులు చితకబాదడంతో ఆ నాయకుడు వారిని పట్టించుకోకపోవడంతో వారంతా ఆయన నుంచి విడిపోయి ప్రస్తుతం మరో టీడీపీ నాయకుడి వద్దకు వద్ద చేరి గ్యాంగ్ వార్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు నిస్సార్ అలియాస్ డాకు మహరాజ్ చాన్‌నూర్, ఫయాజ్ ఖార్ తదితర 9 మందిపై పోలీసులు 307, 324 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటచలపతి తెలిపారు.

ఇకపై మోత ఉండదు

- తగ్గనున్న బ్యాగుల భారం
- పాఠ్యపుస్తకాల భారంపై ప్రభుత్వం దృష్టి
- పుస్తకాల సంఖ్య కుదించేందుకు నిర్ణయం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలులోకి..



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్కూలు పిల్లల పుస్తకాల బరువు ఇకపై తగ్గనుంది. వీపుపై బ్యాగుల భారాన్ని మోస్తున్న చిన్నారులకు త్వరలో ఊరట లభించనుంది. బడి పిల్లలకు గుదిబండలా మారిన బ్యాగుల బరువును తగ్గించడం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. జనవరిలో విద్యాశాఖపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో స్కూల్ పుస్తకాల బరువుపై సంబంధిత అధికారులు మంత్రి నారా లోకేష్ ఎదుట కొత్త ప్రతిపాదనలు ఉంచారు. వీటిపై విద్యాశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. వాచకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్, డైరీలు ఇలా రకరకాల పేర్లతో పిల్లలు తమ శక్తికి మించిన భారాన్ని మోస్తు న్నారు. కొంత మంది తల్లిదండ్రులు ఈవిషయాన్ని పెదగా పట్టించుకోకపోయిన, మిగతా వారు తీవ్రంగా పరిగణించి పిల్లలపై భారాన్ని తగ్గించాలని ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థుల పుస్తకాలు బ్యాగులపై స్టడీ చేసిన పలు కమిటీలు ప్రభుత్వానికి వివిధ సూచనలు చేశాయి. ఏ తరగతి విద్యార్థులకు ఏ మేరకు పుస్తకాల బ్యాగుల బరువు ఉండాలన్న దానిపై ఒక నివేదికను రూపొందించాయి. ఆ సూచనల ప్రకారం పిల్లల బరువులో వారు మోసే పుస్తకాల బరువు పది నుంచి పదైదు శాతానికి మించకూడదు.

తరగతుల వారీగా చూస్తే.... 1,2 తరగతులకు 1.50 నుంచి 2కిలోలకు మంచి బరువు ఉండకూడదు. 3 నుంచి 5 తరగతులకు రెండు నుంచి మూడు, 6,7,8 తరగతులకు 3 నుంచి 4కిలోలు, 9,10 తరతగతులకు 4 నుంచి 5 కిలోలకు మించి బరువు ఉండకూడదు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎదుట ఉంచిన ప్రతిపాదనల ప్రకారం ప్రతి సబ్జెక్టుకు ఒక పుస్తకానికి బదులుగా, కొన్ని సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంగా ముద్రిస్తారు. ప్రాథమిక స్థాయిలో మొత్తం సబ్జెక్టులు ఒకే పుస్తకంలో ఉంటాయి. పై తరగతుల్లో కూడా ప్రస్తుత ఉన్న పుస్తకాలను సగానికి తగ్గించి, రెండు మూడు సబ్జెక్టులు కలిపి ఒకే పుస కంగా తెస్తారు.

ఈ ప్రతిపాదనలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని, విమర్శలకు తావు లేకుండా తగిన విధానం రూపొందించి అమలు చేయాలని మంత్రి ఆదే శించారు. ఈ ప్రతిపాదనలు యదావిధిగా అమ లైతే ఇకపై పాఠశాల విద్యార్థులపై పుస్తకాల మోత భారం తగ్గనుంది. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభానికి ఇంకా రెండు నెలల సమయం ఉన్నందున కొత్త ప్రతిపాదనలు అమలు చేయాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

గతంలో ఇలా...

ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులకు బోధించాలి. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్ మినహా ఇతర పాఠ్యాంశాలను బోధించకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసులు, రివిజన్ టెస్టుల పేరుతో సాధారణ పాఠ్యపుస్తకాలతో పాటు సంస్థల పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందిగా తల్లి దండ్రులకు సూచిస్తున్నాయి. దీంతో పాటు అదనంగా రాసిన పుస్తకాలను పాఠశాలలోనే కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. బయట కొంటే అవి అనర్హమైనవని సాకులు చెబుతూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

బ్యాగుబరువు అయితే అనర్థాలివే..

విద్యార్థులు అధిక బరువు మోయడం వల్ల నడుం, వెన్ను, కండరాల నొప్పికి గురవుతారు. మానసిక ఆందోళన పెరుగుతుంది. చదువుపై దృష్టిపెట్టలేరు. జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. ఆకలి వేయదు. పుస్తకాలను చూడగానే ఆందోళనకు గురవుతారు. పాఠశాలకు వెళ్లే ముందు, వచ్చిన తర్వాత అసహనానికి లోనవుతారు. వీటిని గుర్తించిన విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ నిపుణులతో చర్చించి బ్యాగులు బరువు తగ్గించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను కూడా రూపొందించారు.

మీ సేవలు చిరస్మరణీయం



పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు పోలీసుశాఖకు విశేష సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మార్చి నెలాఖరున పదవీ విర మణ పొందిన కడప వన్‌టౌన్ ఏఎస్ఐలు పి.రాముడు, ఆర్.రాముడు, కడప డీఏఆర్ ఏఆర్ ఎస్ఐ జి.చంద్రశేఖర్‌లను ఎస్పీ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో చేరినప్పటి నుంచి నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతూ పదవీ విరమణ పొందడం అదృష్టమన్నారు. విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగానంతరం గుర్తుండిపోయేలా మంచి పేరుప్రఖ్యాతులు తెస్తాయన్నారు. పదవీ విరమణ పొందిన తరువాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీసుశాఖ ఎల్లవేళాల ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమ ణయ్య, ఆర్ఐలు టైటస్, వీరేశ్, శివరాముడు, డీపీవో ఏవో జ్యోతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల దాహార్తి తీర్చేందుకే నీటి తొట్లు



కొండపేటలో పశువుల తొట్టికి శంకుస్థాపన చేస్తున్న డ్వామా పీడీ

చెన్నూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో పశువులు దాహార్తితో ఇబ్బంది పడకుండా నీటి తొట్లు ఏర్పాటు చేసి.. వాటి సంరక్షణకు కృషి చేస్తోందని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా మండలానికి 9 నీటి తొట్లు మంజూరయ్యాయని తెలిపారు. కొండపేట గ్రామంలో నిర్మించే పశువుల తొట్టికి డ్వామా పీడీ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 714 పశువుల నీటి తొట్లు మంజూరయ్యాయని, ఒక్కోదాన్ని రూ.33వేలతో నిర్మిస్తోందన్నారు. ఈనెల 10లోగా పూర్తి చేయాలన్నారు. ఆ గ్రామంలో ఉన్న పశువులను బట్టి అవసరమైతే మరో తొట్టి కూడా అదనంగా మంజూరు చేస్తామని తెలిపారు. కాగా, ఈ ఏడాది 80 లక్షల పనిదినాలను ఉపాధి పథకంలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఒక్కో కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాలకు మాత్రం 150 రోజులు పనిదినాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లాపశు సంవర్ధకశాఖ సంయుక్త అధికారిని శారదమ్మ, ఏపీడీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఏపీవో శైలజ, ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు, పశువైద్యాధికారి ఎర్రపురెడ్డి, సర్పంచ్ తుంగచంద్రయాదవ్, టీడీపీ నేతలు కె.విజయభాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ ఘర్షణపై డీఎస్పీ ఆరా.. 11 మందిపై కేసు



భూవివాద పొలాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని మద్దిరెడ్డిపల్లెలో సోమవారం దాయాదులైన ఇరువర్గాల వారు భూ సమస్యతో ఘర్షణకు దిగగా ఒకరు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మంగళవారం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ యాదవ్, ట్రైనీ డీఎస్పీ భవానీ వివాదాస్పద భూముల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఘర్షణకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఘర్షణ సందర్భంగా దహనమైన ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. అనంతరం మృతి చెందిన పెసల నారా యణరెడ్డి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి భూతగాదాకు కారణమైన పరిస్థి తులను విచారించారు. ఘర్షణకు సంబంధించి 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ విచారణలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి రాజకీయ సమాధి కడతాం

- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కడప మారుతీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్స రాలుగా ఎస్సీ వర్గీకరణ విషయంలో స్పష్టమైన వైఖరి వెల్లడించ కుండా... మాదిగల అభివృద్ధికి శకునిలా అడ్డుపడిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి రాజకీయ సమాధి కడతామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి డి.రామకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నప్పటికీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో సైతం కనీసం ఒక్క న్యాయవాదిని కూడా నియమించకుండా మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజల భవిష్యత్‌ను నాశనం చేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ కోసం ముందు నుంచి సానుకూలంగా వున్నా రన్నారు. ఆ కోవలో ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమో దింపచేయడం పట్ల సంతో షం వ్యక్తం చేశారు. సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు మానికింది వెంక టేష్, ఎంఎస్‌పీ అధికార ప్రతినిధి మాతయ్య, నాయకులు శివయ్య, నరసిం హ, ఓబయ్య, భాస్కర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు

- భూమిని పరిశీలించిన ఆర్డీవో

సిద్దవటం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టక్కోలి గ్రామ రైతు తన పట్టా భూమిని ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంగళవారం కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ పరిశీలించారు. టక్కోలి గ్రామానికి చెందిన దుంపల అశోక్‌రెడ్డి సర్వేనంబరు 429/1, 429/2, 430లో తన పట్టా భూమి 4.80 ఎకరాల్లో అగ్రికల్చర్ గోడౌన్ నిర్మాణం కొరకు ల్యాండ్ కన్వర్షన్ కొరకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కడప ఆర్డీవో రైతు పట్టా భూమి హద్దులు పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు మాధవీలత, ఆర్ఐ శ్రీనివాసులు, మండల సర్వేయర్ నాగభూషణంరెడ్డి, విలేజ్ సర్వేయర్ పవన్‌కుమార్, వీఆర్వో సంటయ్య పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ

సిద్దవటం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారి భాకరాపేట చాముండేశ్వరిపేట, పార్వతీపురం, మాధవరం-3, ఉప్పరపల్లె గ్రామాల్లో నేషనల్ హైవేకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదల్లో తనిఖీ చేశారు. ఈ బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబునాయుడు దంపతులు, మంత్రులు, వీఐపీ అధికారుల పర్యటన ఉన్నందున ఎస్పీ ఆదేశాలతో ఆర్పీపీ సిబ్బంది, పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

మనస్థాపంతో యువతి ఆత్మహత్య



పోరుమామిళ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన కల్లూరి రామతులసి (25) అనే యువతి ఇంట్లో ఎవరూ లేని సమ యంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీ సుల వివరాల మేర కు.. మండలంలోని తిరువెంగలాపురం గ్రామానికి చెందిన కల్లూరు జయరామిరెడ్డి కుమార్తె తనకు సరైన పెళ్లి సంబంధం రావడం లేదని మనస్థాపం చెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుంది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మంగళ వారం సాయంత్రం మృతదేహానికి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

పాత కలెక్టరేట్‌ను పరిశీలించిన కలెక్టర్



పాత కలెక్టరేట్ భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం బీసీ భవన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాత రిమ్స్, పాత కలెక్టరేట్‌లోని ప్రాంగణాల భవనాలను ఆయన కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ సంబంధిత అధికారులతో కలసి పరిశీలించా రు. ముందుగా పాత రిమ్స్‌లోని ఖాళీ స్థలాలను, నూతనంగా నిర్మి స్తున్న బీసీ వెల్ఫేర్ భవనాన్ని బీసీ సంక్షేమాధికాధికారితో కలిసి మీటింగ్ హాలు, తరగతి గదులు, ఇతర రూములను పరిశీలించారు. బీసీ వెల్ఫేర్ ఫండ్స్ మెయింటెన్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం పాత కలెక్టరేట్‌లోని ప్రాంగణాలను, గదులను పరిశీలించి అక్కడ పని చేసిన గత అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల వివరాలను అడిగి తెలు సుకున్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భరత్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

7,8 తేదీల్లో నూజివీడులో మహాధర్నా

వేంపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులు పనికి సమాన వేతనం కోరుతూ మహాధర్నాకు సిద్ధమవుతున్నారు. తాత్కాలిక అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ ఆధ్వర్యంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మహాధర్నాకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ నెల 7,8 తేదీల్లో నూజివీడు ట్రిపుల్‌ఐటీ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

దాహార్తి తీరేనా..?

- ఎర్రగుంట్లకు గండికోట తాగునీటి స్కీం
- రూ.109 కోట్లతో టీడీపీ హయాంలో మంజూరు
- ఆ స్కీంను గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- తాజాగా రూ.117 కోట్లతో రివైజ్డ్ డీపీఆర్ తయారీ

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యంతో ఎర్రగుంట్ల ప్రజలకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. ఎర్రగుంట్ల ప్రజల దాహార్తి తీర్చేందుకు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.109 కోట్లతో గండికోట నుంచి తాగునీటి స్కీం టెండర్లు పిలి చారు. రెండు ఫేజ్‌లుగా పనిని విభజించి కేటాయించారు. పనులు నిర్వహించేందుకు పైపులు కూడా సరఫరా చేశారు. అనంతరం అధికారం మారింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ పనులను పట్టించుకోలేదు. కేవలం కమీషన్లకు కక్కుర్తిపడి పనులను అడ్డుకున్నార న్న విమర్శలున్నాయి. దీంతో ఎర్రగుంట్ల వాసులకు ఇప్పటికీ తాగు నీటి సమస్య అలాగే ఉంది. దీంతో ఇక్కడి ప్రజల దాహార్తిని తీర్చేందుకు శాశ్వతమైన పరిష్కారం కోసం తాజాగా రూ.117 కోట్ల తో గండికోట నుంచి తాగునీటి స్కీంకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా

ఎర్రగుంట్లలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. సరఫరా అయ్యే నీటికి, వీధులకు వెళుతున్న వంతులకు పొంతనే లేదు. నిల్వ చేసేందుకు సరైనన్ని ట్యాంకులు ఇప్పటికీ లేవు. ఉన్నవాటిని మూలన పడేసి, నీటి సరఫరాను కొందరు ఇష్టారాజ్యంగా మార్చేశారు. కొన్ని వీధుల్లో ప్రతిరోజూ, రెండురోజులకో మారు, మరికొన్ని వీధుల్లో 4 రోజులకు, ఇంకొన్ని వీధుల్లో వారానికి, 10 రోజులకో మారు తాగునీరు వదులుతున్నారు. సుమారు 45 వేల జనాభా ఉన్న ఎర్రగుంట్లకు ప్రస్తుతం పెన్నా, కమలాపురం నీటి స్కీంలే దిక్కు. వర్షాలు రాకపోతే ఎండిపోతున్నాయి. దీంతో తీవ్ర సమస్యలొస్తున్నాయి. కోట్లు వెచ్చించి ట్యాంకులు నిర్మించినా, పైపు లైన్లు వేసినా తాగునీటి సమస్య తీరడం లేదు. బోర్లు ఆదుకుంటున్నా విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. గండికోట స్కీం వస్తే కోట్లలో విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయి. వాటిని ఇతర అభివృద్ధి పనులకు వాడుకోవచ్చు.



పనులు చేపట్టకపోవడంతో గతంలో వచ్చిన పైపులు మార్కెట్‌యార్డులో నిరుపయోగంగా ఉన్న దృశ్యం

రూ.117 కోట్లతో రివైజ్డ్ ప్రతిపాదన

గతంలో రూ.109 కోట్లతో గండికోట నుంచి ఎర్రగుంట్లకు తాగునీటి స్కీం మంజూరైన సంగతి తెలిసిందే. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ పనులను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచన మేరకు ఇటీవల రూ.117.89 కోట్లతో ప్రభుత్వానికి రివైజ్డ్ డీపీఆర్ పంపారు. ఈ మేరకు 8 ఎంఎల్‌డీ సామర్థ్యంతో గండి కోట వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మిస్తారు. గండికోట నుంచి ఎర్రగుంట్ల వరకు 42 కి.మీ. మెయిన్ పైప్‌లైన్ నిర్మిస్తారు. గ్రావి టీతో నీరు సరఫరా అవుతుంది. అలాగే ఎర్రగుంట్లలో 2350 కిలోలీ టర్ల సామర్థ్యం గల మూడు ట్యాంకులు నిర్మిస్తారు.

జడ్పీ బాలుర హైస్కూల్‌లో 25 సెంట్లలో ఒక ట్యాంకు నిర్మించేందుకు గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. హిందూ శ్మశానవాటికలో ఒకటి, ప్రకాష్ నగర్‌లో మరొకటి నిర్మించేందుకు స్థలాలు ప్రతిపాదించారు. ఎర్రగుంట్లలోని 20 వార్డుల్లో 55 కి.మీ. డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ నిర్మిస్తారు. పాత కనెక్షన్స్‌కు ఉచితంగా కనెక్షన్లు ఇవ్వనుండగా కొత్తవాటికి నిబంధనల ప్రకారం కనెక్షన్లు ఇస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ స్కీం అమల్లోకొస్తే ఎర్రగుంట్లకు రోజూ తాగునీరు సరఫరా చేయవచ్చు. అయితే ఈసారైనా ఈ స్కీం పూర్తి చేసి తమ దాహార్తి తీర్చాలని ఎర్రగుంట్ల ప్రజలు కోరుతున్నారు.

డీపీఆర్ పంపాం

గండికోట నుంచి ఎర్రగుంట్లకు తాగునీటి పైప్‌లైన్‌కు సంబంధించి రివైజ్డ్ స్కీంలో రూ.117.89 కోట్లతో డీపీఆర్ పంపాము. అది మంజూరైతే మూడు నాలుగు నెలల్లో టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఎర్రగుంట్లకు మాత్రమే ఈ స్కీం వర్తిస్తుంది.

- మూర్తి, ఈఈ, పీహెచ్

భక్తి శ్రద్ధలతో జ్యోతుల సమర్పణ



బలిహారం కార్యక్రమంలో భక్తులు

ములకలచెరువు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో చౌడేశ్వరిదేవి కి మంగళవారం స్థానికులు జ్యోతులు సమర్పించి, బలిహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం ముందు తిప్పారు. అనంతరం మహిళలు జ్యోతులు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా చిన్నతోటమ్మ తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కురబలకోట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ సింగన్నగారిపల్లె సమీపంలో మంగళవారం చిన్నతోటమ్మ తిరునాళ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. చాందినీ బండ్లను ఊరేగించారు. కులమతాలకతీతంగా హిందూ, ముస్లింలు మొక్కులు చెల్లించారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముదివేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలో నాలుగు రోజులుగా నిర్వహించిన చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉదయం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ ఆవరణలో లడ్డు వేలం నిర్వహించగా, రూ.27,500కు ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్ దక్కించుకున్నారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు వేలం వేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జ్యోతి ఉత్సవాలకు సహకరించిన తొగట కుల భాంధవులకు, యువతకు, పోలీసువారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాలను ఆలయకమిటీ కార్యదర్శి బండి పవన్‌కుమార్, ట్రెజరర్ రామిశెట్టి రత్నమయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉప్పు రామచంద్ర మోడెం సిద్దప్ప బండి నాగరాజ, రామిశెట్టి నీలకంఠ, లోకేష్, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు పూజలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టు ఆవరణలో వెలసిన గంగమ్మకు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆలయప్రధాన అర్చకుడు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్వ్రారి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్, కార్యదర్శి మార్వ్రారి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్లు కరుణాకర్‌నాయుడు, రాటకొండ రంగస్వామినాయుడు, దేవేంద్ర, మార్వ్రారి విక్కి, మార్వ్రారి మహేష్, శ్రీనివాసులు నాయుడు పర్యవేక్షించారు.

రేపు బి.కొత్తకోట మండల మీట్

బి.కొత్తకోట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల సర్వసభ్యసమావేశం ఈ నెల 3న ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు మునుపు రెండుసార్లు కోరంలేక సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ లక్ష్మీనరసమ్మతో మిగతా ఎంపీటీసీ సభ్యులకు పొసగటం లేదు. దీంతో 9 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ ఎంపీడీవోకు నోటీసు కూడా ఇచ్చారు. మరోవైపు వైసీపీ దొడ్డిదారిన ఎంపిక చేసిన ఎంపీటీసీ సభ్యులకు పదవిలో కొనసాగే అర్హతలేదంటూ కూటమినాయకులు అడ్డుతగులుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 3న సమావేశం జరుగుతుందా? మళ్లీ వాయిదా పడుతుందా? అనేది చూడాల్సి వుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కారు. ద్విచక్రవాహనం ఢీ కొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం మండలంలోని ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లి మిట్ట సమీపంలో మారుతి కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంలో కుటుంబంతో వెళుతున్న పెద్దమాదిగపల్లికి చెందిన గణేష్‌కు తీవ్రగాయాలు కాగా, ఆయన భార్య, కుమారుడి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో క్షతగాత్రుడిని మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కారు అతివేగంగా రావడం తోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు స్వాగతం పలుకుతున్న మహిళలు

రామసముద్రం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న మదనపల్లె ఎమ్మెల్యే షాజాహాన్‌బాషా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెలో పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే రూ.3 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మించామని, తాగునీటి కోసం అవసరమైన చోట, కొత్త బోర్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించాలని ఎంపీడీవో భానుప్రసాద్‌ను ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలు కేటాయించాలని తహసీల్దార్ నిర్మలాదేవిని ఆదేశించారు. మదనపల్లె-రామసముద్రం రోడ్డు విస్తరణ పనులు, మండలానికి హంద్రీనీవా జలాలు తీసుకురావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని ప్రతి పంచాయతీలో పశువులకు తాగునీటి సౌకర్యం కోసం నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రెండు నెలల్లో మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. కాప్పల్లె గ్రామంలో టీడీపీ నాయకుడు లోకనాథ్‌రాజుతో కలసి నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, మాజీ సర్పంచ్ తిప్పన్న, టీడీపీ నేతలు రూపేష్‌రెడ్డి, చెంబకూరు వెంకటేష్, ఇలియాజ్‌బాషా, నడింపల్లె రమేష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డెప్ప, హోటల్ నారాయణస్వామి, టీస్టాల్ కిట్టా, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజి, ఏపీవో మాధవి, ఏపీఎం సాంబశివ, పంచాయతీ సెక్రటరీ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పశువుల నీటి తొట్టె పనులు ప్రారంభిస్తున్న జయచంద్రారెడ్డి



ఎర్రగుంటపల్లెలో భూమిపూజ చేస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

ములకలచెరువు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తంబళపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. పాత ములకలచెరువు పంచాయతీ రాగిమానిపల్లెలో మంగళవారం ఉపాధి హామీ పథకం కింద పశువులకు నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద నీటి తొట్టెలను నిర్మిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మహిళా కార్యదర్శి గంగాదేవి, ఏపీవో నారాయణస్వామి, నాయకులు రాందాసు, శంకర పాల్గొన్నారు.

పీలేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పీలేరు మండలానికి 29 పశువుల తాగునీటి తొట్టెలు మంజూరైనట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. పీలేరు మండలం ఎర్రగుంటపల్లె, ముడుపులవేములలో నీటి తొట్టె నిర్మాణ పనులకు మంగళవారం పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, ఉపాధి ఏపీవో అశోక్ రెడ్డి, టీడీపీ నేతలు శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, పసుపులేటి లక్ష్మీకర, ప్రభాకర్ రాజు, దినచంద్రారెడ్డి, రెడ్డిశేఖర, ముడుపులవేముల అమరనాథరెడ్డి, రహంతుల్లా భూమిపూజ చేశారు.

పెద్దతిప్పసముద్రం:రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లెలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఏపీవో తిరుపాలప్పతో కలిసి నీటి తొటె నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలకడ: గంగాపురం పంచాయతీలో ఎంపీడీవో అబ్దుల్ రహీం నాయకులు కోట రమణనాయుడు, ఏపీవో సుజాత నీటి తొట్ట పనులు ప్రారంభించారు.

అట్టహాసంగా బావిలో గంగమ్మ జాతర



మొక్కులు చెల్లించుకునేందుకు వెళుతున్న భక్తులు

బి.కొత్తకోట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం గంగాభవాని(బావిలో గంగమ్మ) జాతరను ఆలయ ధర్మకర్త చింతల శంకరమూర్తి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి పూజలు నిర్వహిం చారు. పట్టణంలోని బీసీ కాలనీ, నందిశెట్టివీధి, బైపాస్‌రోడ్డు, పాశంవీధి తదితర ప్రాంతాల నుంచి పొట్టేళ్లను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకొచ్చి మొక్కులు చెల్లించు కున్నారు. మహిళలు దీలు, జ్యోతులు మోసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి సర్కిల్ కిక్కిరిసింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి, బందోబస్తును పర్యవేక్షించారు.

భూ సమస్యలపై దృష్టి సారించాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సుబ్బమ్మతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కలకడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూసమస్యలపై దృష్టి సారించి సాధ్యమైనంత వరకు పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీలో ఆకస్మికంగా పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. గ్రామానికి చెందిన వై.సుబ్బమ్మ అనే వృద్ధురాలి సర్వే నెంబరు 984/4లో ఉన్న భూసమస్యపై అర్జీ సమర్పించిన నేపథ్యంలో కలెక్టర్ విచారణ చేపట్టారు. అనంతరం పీజీఆర్ఎస్ అర్జీల పురోగతిపై సమీక్షించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, సర్వేయర్ దేవి, వీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీవో మధుమతి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నమయ్య జిల్లా అధికారి గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్(జి.సి.డి.ఒ) ఆఫీసర్ మధుమతి తెలిపారు. మంగళవారం స్థానిక ముష్టూరు పంచాయతీలోని కస్తూరిబా పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినుల హాజరు పట్టిక పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. మెనూ అమలు, కాస్మెటిక్స్ ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె పాఠశాల పరిశుభ్రత, తరగతి గదులు పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందు చూపు ప్రోగ్రాంలో భాగంగా 9వ తరగతి విద్యార్థినులకు మార్చి 10 నుంచి ఏప్రిల్ 10 వరకు 10వ తరగతి సిలబస్‌పై క్లాసులు నిర్వహించన్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జీసీడీవో శిరీష, పాఠశాల ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలు

మదనపల్లె, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూళ్లలో రికార్డు సాధించింది. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.17.11 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో ఈ మేరకు ప్రగతి సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ కే. ప్రమీల తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ..మదనపల్లె పట్టణంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు ప్రాపర్టీస్ అన్నింటిని కలుపుకుని మొత్తం పన్నులు రూ.23.36 కోట్లు డిమాండ్ ఉండగా.. ఇందులో రూ.17.11 కోట్లు (73.34శాతం) వసూలైందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల కారణంగా ఆశించిన స్థాయిలో ప్రగతి సాధించకపోయినా, ఈ ఏడాది మున్సిపల్, సచివాలయ సిబ్బంది సహకారంతో ప్రగతిని సాధించామన్నారు. ప్రైవేట్ ఆస్తుల విషయానికి వస్తే పట్టణంలోని 28,068 అసెస్‌మెంట్ల నుంచి రూ.18.80 కోట్లు డిమాండ్ కాగా, రూ.16.02 కోట్లు వసూలు చేశామన్నారు. గత ఏడాది రూ.16.5 కోట్ల డిమాండ్ ఉండగా, రూ.12.01 కోట్లు వసూలైందన్నారు. మార్చి 31లోగా పన్ను చెల్లించే వారికి 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో ఉత్తర్వులు ఇచ్చిన 5 రోజుల్లోనే అనూహ్యంగా రూ.1.9 కోట్లు వసూలైందన్నారు. సెలవు రోజుల్లోనూ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో చెల్లింపులు ఎరిగినట్లు వివరించారు. కాగా, గత ఏడాదితో పోలిస్తే ఈసారి బకాయిల చెల్లింపులు కూడా పెరిగాయని, ప్రభుత్వ సంస్థలు కూడా బకాయిల చెల్లించడం విశేషమన్నారు.

సింహప్రభపై చౌడేశ్వరి విహారం

కలకడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):కలకడ మండలం కోన చౌడేశ్వరి ఉత్సవాల్లో మంగళవారం అమ్మవారు సింహప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి పుష్పపల్లకిని రంగు రంగుల దీపాలతో అలంకరించారు. జ్యోతులు ఊరేగించారు. అగ్ని గుండప్రవేశం నిర్వహించారు. కోన గ్రామంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు దర్శించుకున్నారు.



అగ్నిగుండం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



జ్యోతులను ఊరేగిస్తున్న భక్తులు (ఇన్‌సర్ట్) సింహవాహనంపై చౌడేశ్వరి అమ్మవారు

ఎఫ్‌పీ షాపు ఏర్పాటు చేయాలి



వాల్మీకిపురం కాలనీ వద్ద ఆందోళన చేస్తున్న కార్డుదారులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కొత్త ఇందిరమ్మ కాలనీలో చౌక ధరల దుకాణం ఏర్పాటు చేయాలంటూ మంగళవారం స్థానికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీకి రెండు కిలోమీటర్ల దూరంలో రేషన్ షాపు ఉండడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. స్థానికుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వ కాలనీలో చౌక ధరల దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయం స్థానిక తహసీల్దార్‌కు కూడా విన్నవించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గంగాధర్, సుజాతమ్మ, ఖాదర్ హుస్సేన్, రెడ్డిబూ, కుమారి, నీలమ్మ, లక్ష్మమ్మ, సునిత, ఇమాంబీ, పరసురెడ్డి,వెంకటేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి

పీలేరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బెట్టింగులకు దూరంగా ఉండాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ సూచించారు. బెట్టింగ్‌కు వ్యతిరేకంగా ఎస్ఎస్‌యూఐ నిర్వహిస్తున్న ప్రచార వాల్‌పోస్టర్లను మంగళవారం ఆయన పీలేరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, యువత ఎక్కువగా బెట్టింగ్ యాప్‌ల బారినపడుతున్నారని, దానిపై పాఠశాలలు, కళాశాలల్లో చర్చ జరగాల్సి ఉందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, సమాజ సేవకులు సంఘటితమై దాని బారి నుంచి అందరినీ కాపాడుకోవాలన్నారు. బెట్టింగ్ యాప్‌లపై ఎస్ఎస్‌యూఐ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిసంపత్ కుమార్, అఖిల్, దినేశ్, లోకేశ్, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి..



వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్

వాల్మీకిపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం మండలం చింతపర్తి పీహెచ్‌సీ డాక్టర్ జులేఖాబేగం, హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ సూచించారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని కొత్త మంచూరు గ్రామంలో వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియ జేసి, మందులు పంపిణీ చేశారు. మంచినీరు, పళ్లరసాలు, ఎక్కువగా తీసుకోవాలని అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయాలలో ఎండకు తిరగరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వనిత, ఆశా వర్కర్లు రేవతి, హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవళచెరువులో చిత్తూరు డీవైఈవో అంత్యక్రియలు

● నివాళులర్పించిన ఆర్‌జేడీ శామ్యూల్



నివాళులు అర్పిస్తున్న ఆర్‌జేడీ శామ్యూల్

ములకలచెరువు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన చిత్తూరు డీవైఈవోకు మండలంలోని దేవళచెరువులో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించా రు. ములకలచెరువు మండలం దేవళ చెరువుకు చెందిన చంద్రశేఖర్ చిత్తూరు జిల్లా డీవైఈవోగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన పార్థివ దేహాన్ని మంగళవారం ఆయన స్వగ్రామమైన దేవళచెరువుకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్‌జేడీ శామ్యూల్ పార్థివదేహం వద్ద నివాళులు అర్పించారు. విద్యాశాఖలో చంద్రశేఖర్ సేవలను గుర్తు చేసుకున్నారు. చిత్తూరు డీఈవో వరలక్ష్మీ, ఎస్ఎస్ఏ పీవో వెంకటరమణనాయుడు, పీడీ వెంకటేశ్వరరావు, తిరుపతి డీవైఈవో బాలాజీ, ఎస్టీయూ నాయకులు రమణప్ప, మధు, మహమ్మద్‌ఖాన్ తదితరులు నివాళులు అర్పించారు.

'మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి'

రాజంపేటటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆప్కాస్ విధానం రద్దు చేసి మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు.

కూటమి హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం



మార్కెట్ చైర్మన్‌ను సన్మానిస్తున్న కూటమి పార్టీల నాయకులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వంతో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని బీజేపీ జిల్లా కార్యదర్శి పులి నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం వాల్మీకిపురం పట్టణంలో నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళిని సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాల్మీకిపురం మార్కెట్ కమిటీ యార్డులో గొర్రెలు, పొటేళ్ల సంత ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘ అధ్యక్షుడు విష్ణుచైతన్య, మండల బీజేపీ అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, నాయకులు పీవీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో కూలీల సంఖ్య పెంచండి

పెద్దమండ్యం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో సురేంద్రనాధ్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు పెంపకానికి 5 ఎకరాల లోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లతో పాటు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. పని ప్రదేశంలో జాబ్‌కార్డులు, మస్టర్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. మండలానికి 35 పశువుల తాగునీటి తొట్టెలు మంజూరైనట్లు తెలిపారు.ఈ తొట్టెల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు.

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకుడిని పరిశీలిస్తున్న సీఐ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడు కత్తితో దాడి చేయడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపిన వివరాల మేరకు మంగళవారం రాత్రి మదనపల్లె పట్టణం, రాంనగర్‌కు చెందిన సురేంద్ర బాబు పట్టణంలోని అ ప్పారావువీధిలో బాలాజీ ఎంటర్ ప్రైజెస్ నిర్వహిస్తుండగా, శ్రీనివాసులు కమ్మెపని చేస్తుంటాడు. చౌక బియ్యం కొనుగోలు విషయంలో సురేంద్రబాబుకు, కమ్మగడ్డవీధికి చెందిన వేణుగోపాల్ మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక రాంనగర్ పార్కులో ఉన్న సురేంద్రబాబు(38)పై వేణుగోపాల్ కత్తితో దాడికి యత్నించాడు. విషయం గమనించిన శ్రీనివాసులు(38) అతని యత్నాన్ని అడ్డుకోవడంతో అతనిపై కూడా కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సురేంద్రబాబు ఇక్కడే చికిత్స పొందుతుండగా, శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఈ సంఘటనతో మదనపల్లె ఆస్పత్రి ఆవరణ బాధితుల బంధువులు, కుటుంబ సభ్యులు, మిత్రులతో నిండిపోయింది. టూటౌన్ సీఐ రామచంద్ర ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడికి గాయాలు



రోడ్డుప్రమాదంలో గాయపడిన పారిశుధ్య కార్మికుడు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): రోడు ప్రమాదంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు గాయపడిన సంఘటన మండలంలోని బొమ్మనచెరువు వద్ద చోటు చేసుకుంది. తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడుగా పని చేస్తున్న ఈశ్వరప్ప (42) మంగళవారం పని ముగించుకుని స్వగ్రామం పనసమానుకుంటకు బైక్‌పై వెళుతుండగా చెండకూరు నుంచి మదనపల్లెకు వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన యువకుడిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ తెలిపారు.

కిటకిటలాడిన పీలేరు బస్టాండు



పీలేరు బస్టాండులో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పీలేరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ బస్టాండు మంగళవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. పదవ తరగతి పరీక్షలు పూర్తి కావడంతో ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు, ఇంటర్ ద్వితీయ ఏడాది క్లాసుల కోసం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉగాది, రమజాన్ పండుగలు ముగించుకుని ఉద్యోగాల కోసం బయలుదేరిన వారితో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు పీలేరు బస్టాండులో రద్దీ నెలకొంది. దీంతో తిరుపతి, రాయచోటి, బెంగళూరు పట్టణాలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేశామని పీలేరు డీఎం నిర్మల తెలిపారు. బుధవారం కూడా అదనపు సర్వీసులు నడపనున్నట్లు ఆమె తెలిపారు.